తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | మంగళవారం-11-నవంబర్ 2025 | సంపుటి : 3 | సంచిక : 163 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


- పేలుడు ధాటికి విధ్వంసం
- ఢిల్లీలో హైఅలర్ట్
- పేలుడు వెనుక ఉగ్రకోణం?
- జాతీయ నాయకుల స్పందన
- దర్యాప్తు ముమ్మరం
- కశ్మీర్ వాసి పేరిట కారు రిజిస్ట్రేషన్
- ఐఈడీ కాదు, రసాయనిక పేలుడా?
- సీసీటీవీలు, మొబైల్ డేటా విశ్లేషణ
- ఆస్పత్రుల్లో ఆర్తనాదాలు
- ఎటు చూసినా రక్తపు మరకలు
- ప్రత్యక్ష సాక్షుల వర్ణన
- పుకార్లకు దూరంగా ఉండమన్న సీఎం

# ఢిల్లీని కుదిపిన కార్ బ్లాస్ట్



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)
హస్తినలోని చారిత్రక ఎర్రకోట సమీపంలో సోమవారం సాయంత్రం భారీ పేలుడు సంభవించింది. లాల్ ఖిలా మెట్రోస్టేషన్ ఒకటో నంబర్ గేటు సమీపంలో ట్రాఫిక్ సిగ్నల్ పడటంతో ఆగిన హ్యుందాయ్ ఐ20 కారులో జరిగిన భారీ పేలుడు ధాటికి కారులోని ముగ్గురు సహా మొత్తం తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. పక్కన ఉన్న ఆరు కార్లు, రెండు ఇ–రిక్షాలు, ఆటోలు సైతం తీవ్రస్థాయిలో ధ్వంసమయ్యాయి. దీంతో మరో 20 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరందరినీ హుటాహుటిన సమీపంలోని లోక్‌నాయక్ జయప్రకాశ్ ఆస్పత్రిలో చేర్పించారు.

మిగతా 2లో



# ప్రజాకవి అందెశ్రీ కన్నుమూత

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)
తెలంగాణలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ(64) తుదిశ్వాస విడిచారు. ఆదివారం రాత్రి ఆయన తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఇంట్లోనే ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. దీంతో, కుటుంబ సభ్యులు ఆయనను గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. సోమవారం ఉదయం 7:25 గంటలకు అందెశ్రీ చనిపోయినట్టు వైద్యులు వెల్లడించారు. ప్రజాకవి, ప్రకృతి కవిగా సుప్రసిద్ధులైన డా. అందెశ్రీ ఉమ్మడి వరంగల్ జిల్లా జనగాంలోని రేబర్తిలో జూలై 18, 1961లో జన్మించారు. ఆయన అసలు పేరు అందె ఎల్లయ్య. అందెశ్రీకి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

మిగతా 2లో


## పార్కులు అదృశ్యం కబ్జాల పెరుగు!

- ప్రభుత్వ భూములపై కబ్జాలు–పారశాల కోసం వినతి
- అమీన్‌పూర్–రావిర్యాలలో చెరువుల విస్తీర్ణం సమస్య

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)
నగర పరిధిలో పార్కుల నామరూపాలు మారిపోతున్నాయన్న ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. లే–ఔట్‌లలో పార్కులకు కేటాయించిన స్థలాల్లో ఆలయాలు నిర్మించి, మల్గీలు వేసి వ్యాపారాలు నిర్వహిస్తున్నారనే అంశాన్ని పలు ప్రాంతాల ప్రజలు సోమవారం హైడ్రా ప్రజావాణిలో ఎత్తిచూపారు.

మిగతా 3లో






## హైడ్రాకు ప్రజల అండ నగర అభివృద్ధిలో కొత్త విశ్వాసం


- ప్రజల మద్దతుకు హైడ్రా ధన్యవాదాలు
- చట్ట గౌరవంతో ముందుకు హైడ్రా
- వరద నియంత్రణ–చెరువుల పునరుద్ధరణ ఫలితాలు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)
హైడ్రా కార్యక్రమాలకు నగర ప్రజలు తెలియజేస్తున్న విస్తృత మద్దతుపై హైడ్రా కృతజ్ఞతలు తెలిపింది. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న దుష్ప్రచారాన్ని ప్రజలు ర్యాలీల ద్వారా ఖండించడంతో సంస్థ హర్షం వ్యక్తం చేసింది. “మీరిచ్చిన స్ఫూర్తి మాకు మరింత ఉత్సాహం నింపింది” అంటూ హైడ్రా కమిషనర్ ఏవీ రఘునాథ్ స్పందించారు. పర్యావరణ హిత నగర నిర్మాణం లక్ష్యంగా, ప్రభుత్వం సూచించిన దిశగా హైడ్రా ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు.
చట్టాల పట్ల గౌరవంతో, రాజ్యాంగ స్ఫూర్తితో హైడ్రా పని చేస్తోందని కమిషనర్ తెలిపారు.

మిగతా 3లో

## మాట్రిమోని వెబ్‌సైట్లు, యాప్స్ పేరుతో మోసాలు పెరుగుతున్నాయ్

అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేసిన తెలంగాణ పోలీసులు





హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)
వివాహ పరిచయాల పేరుతో ఆన్‌లైన్‌లో జరుగుతున్న మోసాలు, వలపులు మరింత పెరుగుతున్న నేపథ్యంలో తెలంగాణ పోలీసులు ప్రజలకు అప్రమత్తం కల్పించారు. మాట్రిమోని వెబ్‌సైట్లు, మొబైల్ యాప్స్, సోషల్ మీడియా వేదికగా నమ్మకాన్ని దోపిడీ చేస్తున్న మోసగాళ్ల గురించి స్పష్టమైన సూచనలు, జాగ్రత్తలు సూచిస్తూ పోలీసులు ప్రత్యేక అవగాహన పోస్టర్‌ను విడుదల చేశారు.
ఆన్‌లైన్ పరిచయాల ద్వారా తమను డాక్టర్లు, ఉద్యోగస్తులు, విదేశాల్లో స్థిరపడినవారిగా చెప్పుకుంటూ మోసగాళ్లు బలహీన భావోద్వేగాలను ఉపయోగించుకొని డబ్బులు వసూలు చేస్తున్న కేసులు పెరుగుతున్నాయని పోలీసులు హెచ్చరించారు. ఒకే దేశం, ఒకే మతం, ఒకే రాష్ట్రం అనే పేర్లతో నమ్మకం పెంచి... అనంతరం అబద్ధపు కథలు చెప్పి డబ్బులు అడగడం, విలువైన వస్తువులు పంపించమని ఒత్తిడి చేయడం వంటి ఘటనలు నమోదవుతున్నాయని తెలిపారు. వధూవర పరిచయాల యాప్‌లలో వ్యక్తిగత వివరాలు పంచే ముందు వినియోగదారులు తప్పనిసరిగా ధ్రువీకరణ చేసుకోవాలని, వ్యక్తిగత ఫోటోలు, ఆధార్, బ్యాంక్ వివరాలు వంటి సున్నితమైన సమాచారం ఎవరికీ ఇవ్వొద్దని పోలీసులు సలహా ఇచ్చారు. సందేహాస్పద ప్రొఫైళ్లపై వెంటనే రిపోర్ట్ చేయాలని సూచించారు.

మిగతా 2లో

## స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై సుప్రీంలో కోర్టు ధిక్కరణ పిటిషన్

ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హతపై గడువు ముగిసినా నిర్ణయం తీసుకోలేదని బీఆర్ఎస్ ఆరోపణ



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)
తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై సుప్రీం కోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సుప్రీం కోర్టు విధించిన గడువు ముగిసినా, స్పీకర్ ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఈ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను అత్యవసరంగా విచారణకు స్వీకరించాలని బీఆర్ఎస్ అభ్యర్థించింది. జూలై 31న సుప్రీం కోర్టు ఫిరాయింపు ఎమ్మెల్యేలపై విచారణ పూర్తి చేసి, అక్టోబర్ 31వ తేదీ లోపు నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు ఆదేశించిన విషయాన్ని బీఆర్ఎస్ గుర్తుచేసింది. అయితే గడువు పూర్తైనా నిర్ణయం వెలువడకపోవడంతో, ఫిరాయింపు నేతలు ఇంకా ఎమ్మెల్యేలుగానే కొనసాగుతున్నారని పిటిషన్‌లో పేర్కొంది. అందుచేత మళ్లీ సుప్రీం కోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని బీఆర్ఎస్ వాదిస్తోంది. విచారణ ప్రక్రియ ఆలస్యం చేయడం అనర్హత నిర్ణయానికి వ్యతిరేక ప్రభావం చూపుతుందని,

మిగతా 3లో

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌కు ఓటర్లు బుద్ధి చెబుతారు: హరీశ్‌రావు

- ఉపఎన్నికలో కాంగ్రెస్ అక్రమాలు, దుర్వినియోగం ఆరోపణ
- ఎలక్షన్ కమిషన్‌కు ఆధారాలతో బీఆర్ఎస్ ఫిర్యాదు
- ఓటమి భయంతోనే సమీక్షల నాటకం : హరీశ్‌రావు విమర్శ

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)
జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ప్రలోభాల రాజకీయాలకు పాల్పడుతూ, భారీ స్థాయిలో అవకతవకలు జరుపుతోందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. మద్యం, డబ్బు, చీరలు, మిక్సీ గ్రైండర్లు పంపిణీ చేస్తూ ఓటర్లను ప్రభావితం చేయాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని తెలిపారు. ఈ అక్రమాలకు సంబంధించిన చిత్రాలు, వీడియోలను ఎన్నికల సంఘానికి సమర్పించామని వెల్లడించారు. అధికార యంత్రాంగాన్ని తమకు అనుకూలంగా వాడుకుంటున్న అధికార పార్టీపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఈవో సుదర్శన్‌రెడ్డిని కోరినట్టు తెలిపారు.

మిగతా 2లో





## మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అజారుద్దీన్

- మత పెద్దల ప్రార్థనల మధ్య అధీక్ష బాధ్యతలు చేపట్టిన అజారు
- సీఎంపై నమ్మకాన్ని నిలబెట్టుకుంటా – మంత్రి అజారుద్దీన్ హామీ
- మైనార్టీ సంక్షేమం–పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖల్లో సంస్కరణలకు సంకల్పం

2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఢిల్లీని కుదిపిన కార్ బ్లాస్ట్






(మొదటి పేజీ తరువాయి)

పేలుడు ధాటికి సమీప మార్కెట్‌లోని ప్రజలు, రోడ్లమీద ఉన్న వ్యక్తులు ప్రాణభయంతో పరుగులుతీశారు. తీవ్రస్థాయి పేలుడు కారణంగా మృతదేహాలు ఛిద్రమై చెల్లాచెదురుగా పడ్డాయి. దీంతో అక్కడ భీతావహవాతావరణం నెలకొంది. మంటలు, హాహాకారా లు, ఆర్తనాదాలతో ఆ ప్రాంతంలో ఒక్కసారిగా కలకలం చెలరేగింది. ఢిల్లీ సమీప ఫరీదాబాద్‌లో 2,900 కేజీల పేలుడు పదార్థాలను జమ్మూకశ్మీర్, హరియాణా, యూపీ పోలీసుల బృందం స్వాదీనంచేసుకున్న కొన్ని గంటలకే ఢిల్లీలో భారీ పేలుడు సంభవించడం యాధృచ్ఛికం కాదని దర్యాప్తు వర్గాలు అనుమానం వ్యక్తంచేస్తున్నాయి.

ఘటనపై రాష్ట్రపతి ముర్ము, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, ప్రధాని మోదీ, లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. పేలుడు ఘటనతో కేంద్రం అప్రమత్తమైంది. ఢిల్లీలో హైఅలర్ట్ ప్రకటించారు. పొరుగు రాష్ట్రాల నుంచి ఢిల్లీకి దారితీసే అన్ని రహదారులపై ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఎర్రకోట, పార్లమెంట్, మెట్రో స్టేషన్లు, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, ఎయిర్‌పోర్ట్, రైల్వేస్టేషన్ల వద్ద భద్రతను కట్టుదిట్టంచేశారు. జనసమ్మర్ధ ప్రాంతాల్లో సోదాలను పెంచారు.

లాడ్జిలలోనూ తనిఖీలు చేపట్టారు. ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతుందని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. ఢిల్లీ పోలీస్, జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ), నేషనల్ సెక్యూరిటీ గార్డ్(ఎన్ఎస్‌జీ), ఫోరెన్సిక్ బృందాలు ఘటనాస్థలికి చేరుకున్నాయి. ఆధారాలను ఫోరెన్సిక్ బృందాలు సేకరిస్తున్నాయి. ఘటన జరిగిన తీరును అక్కడి ప్రత్యక్ష సాక్షులను అడిగి తెల్సుకుంటున్నారు పేలుడు తర్వాత మంటలు, దట్టమైన పొగ అలుముకున్న ఆ ప్రాంతంలో మంటలను రాత్రి ఏడున్నరకల్లా ఆర్పేశామని ఢిల్లీ అగ్నిమాపక శాఖ తెలిపింది. అయితే ఇది ఉగ్రదాడి అని వార్తలొస్తున్నా ఇప్పటిదాకా ఏ ఉగ్రసంస్థా ఈ పేలుడుకు బాధ్యులము తామేనని ప్రకటించుకోలేదు.

ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం సరిగ్గా సాయంత్రం 6 గంటల 52 నిమిషాలకు లాల్‌ఖిలా మెట్రోస్టేషన్ ఎదురుగా ఉన్న సుభాష్ మార్గ్ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఎర్రలైట్ పడటంతో కొన్ని వాహనాలు ఆగాయి. అదే సమయంలో ఐ20 మోడల్ కారు వెనుకభాగం ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలిపోయింది. దీంతో పక్కనే ఉన్న ఛాందిని చౌక్ మార్కెట్‌లోని జనం భయంతో పరుగులు తీశారు. పేలుడు ధాటికి సమీప వాహనాలు సైతం మంటల్లో కాలిపోయాయని ఢిల్లీ పోలీస్ కమిషనర్ సతీశ్ గోల్చా మీడియాతో చెప్పారు. ఘటనపై మంత్రి అమిత్ షాతో మాట్లాడారు. ఘటన వివరాలను ప్రధాని మోదీ అమిత్‌షాను అడిగి తెల్సుకున్నారు. ఛాందిని చౌక్ మార్కెట్ సమీపంలోనే పేలుడు సంభవించడంతో జనం రద్దీని కట్టడిచేసేందుకు మంగళవారం మార్కెట్‌ను మూసేస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు సంజయ్ భార్గవ చెప్పారు.

పేలిన కారు హరియాణాలో హెచ్ఆర్26సీఈ 7674 నంబర్‌తో రిజిస్ట్రర్ అయినట్లు గుర్తించారు. కారు యజమాని నదీం ఖాన్‌ను గురుగ్రామ్‌లో అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. అయితే ఇటీవల ఈ కారు పలువురు యజమానులు చేతులు మారినట్లు తెలుస్తోంది. అయితే చివరిసారిగా కశ్మీర్‌లోని పుల్వామాకు చెందిన తారిఖ్ అనే వ్యక్తి దీనిని కొనుగోలుచేసినట్లు తెలుస్తోంది.

అయితే కారు క్రయ, విక్రయల సమయాల్లో తప్పుడు గుర్తింపు పత్రాలు, డాక్యుమెంట్లను వినియోగించారని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. అయితే 2013 మోడల్ ఐ20 తెలుపు రంగు కారుకు గతంలో యజమాలుగా ఉన్న ఎండీ సల్మాన్, దేవేందర్‌లనూ పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. గురుగ్రామ్‌లోని శాంతినగర్‌కు చెంది సల్మాన్ ఈ కారును ఏడాదిన్నర క్రితం ఢిల్లీలోని ఓఖ్లా ప్రాంతానికి చెందిన దేవేందర్‌కు విక్రయించాడు. తర్వాత ఈ కారును అంబాలా నగరంలో మరొకరు కొన్నారు.

పేలిన కారులో ముగ్గురు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మృతులు, గాయపడిన శరీరభాగాల్లోకి ఎలాంటి మేకులు, చిన్న పాటి ఇనుప గుండ్లు దూసుకెళ్లలేదు. ఉగ్రవాదులు ఉపయోగించే ఐఈడీ తరహా పేలుడుపదార్థంలో ఇలాంటి వాటిని చొప్పించి పేలుడు విస్తృతి ఎక్కువగా ఉండేలా, పెద్దసంఖ్యలో జనం మరణించేలా కుట్ర పన్నుతారు. కానీ ఈ ఘటనలో ఎలాంటి మేకులు, బాల్ బేరింగ్‌లు, చిన్న వైర్ల జాడ కనిపించలేదు. కానీ ఘటనాస్థలిలో ఒక బుల్లెట్‌ను కనుగొన్నారు.

రసాయన పదార్థంకారణంగా సంభవించే కాలిన గాయాలు సైతం మృతదేహాలపై లేవు. దీంతో ఏ తరహా పదార్థం పేలిందనే అంశంపైనా పోలీసులు దర్యాప్తు మొదలెట్టారు. ఢిల్లీ నేర విభాగం, ప్రత్యేక విభాగం, జాతీయ దర్యాప్తు సంస్థలకు చెందిన బృందాలు వేర్వేరు కోణాల్లో దర్యాప్తును ముమ్మరంచేశాయి. పేలిన కారు అంతకు ముందు ప్రయాణించిన మార్గాల్లోని సీసీటీవీ ఫుటేజీలను చెక్ చేస్తున్నారు. ఘటనాస్థలిలో ఘటన జరిగినప్పుడు అక్కడ క్రియాశీలకంగా ఉన్న మొబైళ్ల తాజా లొకేషన్లనూ సరిచూస్తున్నారు.

రిమోట్ కంట్రోల్ ద్వారా సమీపం నుంచే బాంబును పేల్చి ఉంటారన్న కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. పేలుడుకు కొన్ని సెకన్ల ముందు ఒకవేళ అక్కడి పాదచారులు సెల్ఫీ వీడియోలు, ఫొటోలు తీసుకుంటే వాటిని తమకు అందజేసి దర్యాప్తునకు సహకరించాలని పోలీసు విభాగం పౌరులను కోరింది. ఈ పేలుడు అధిక-ఉష్ణోగ్రతను వెదజల్లే విస్ఫోటనం కాకుండా యాంత్రిక లేదా రసాయనిక విస్ఫోటనం అయి ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. అందుకే నైట్రేట్లు లేదా టీఎన్‌టీ వంటి జాడను వెతుకుతున్నారు.

పేలుడు ఘటనలో తమ వారు ప్రాణాలు కోల్పోయారన్న వార్త తెలిసి కుటుంబసభ్యులు, బంధువులు హుటాహుటిన మార్చురీలు, ఆస్పత్రులకు చేరుకుని దిక్కులు పిక్కటిల్లేలా రోదించారు. క్షతగాత్రుల కుటుంబసభ్యులు, స్థానికులు, మీడియా ప్రతినిధులతో ఆస్పత్రి ప్రాంగణం నిండిపోయింది. తమ వారిని ఐసీయూలో చేర్పించారని, ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు ఏ విషయాలు చెప్పట్లేరని పలువురు కుటుంబసభ్యులు ఆస్పత్రి ముందు ఆందోళన వ్యక్తంచేశారు.


కేంద్రహోం మంత్రి అమిత్ షా సైతం లోక్‌నాయక్ జయప్రకాశ్ ఆస్పత్రికి వచ్చి క్షతగాత్రుల ఆరోగ్యంపై వాకబు చేశారు. స్వల్ప గాయాలైన క్షతగాత్రులను ఓదార్చారు. ఘటన జరిగిన తీరును ప్రధాని మోదీకి వివరించారు. తర్వాత ఘటనాస్థలికి రాత్రి పదిన్నర ప్రాంతంలో అమిత్ షా చేరుకున్నారు. పేలుడు జరిగిన తీరును అక్కడి దర్యాప్తు అధికారులు అమిత్ షా వివరించారు.

''శక్తివంతమైన పేలుడు దెబ్బకు కొద్దిసేపు మా చెవులు గిల్లుమన్నాయి. అసలేం జరిగిందో చూసేలోపే అంతటా మంటలు. చుట్టూతా ముక్కలైన మృతదేహాలు శరీరభాగాలు. కొన్ని ముక్కలు వాహనాలపై, మరొకొన్ని రోడ్లమీద పడ్డాయి. అంతటా రక్తపు మరకలు. మంటలు అంతెత్తున ఎగసిపడ్డాయి. పేలుడు ధాటికి ఎంతో ఎత్తున ఉండే హైమాస్ట్ వీధిదీపాలు సైతం పగిలిపోయాయి. దుకాణాల, మెట్రో స్టేషన్ గాజు ప్యానెళ్లు సైతం బద్దలయ్యాయి.

సమీప వాహనాలు, అందులోని వాహనాదారులకు సైతం మంటలు అంటుకున్నాయి''అని ప్రత్యక్ష సాక్షి, 36 ఏళ్ల అమిత్ ముద్గల్ భయంభయంగా చెప్పారు. ముగ్గురు పురుషులు ముక్కలై పడి ఉన్నారని మరో ప్రత్యక్ష సాక్షి భూపీందర్ సింగ్ చెప్పారు. ''చాలా మంది చేతులు, వేళ్లు తెగి పడ్డాయి. ఒక కారు స్టీరింగ్ చక్రం విరిగిపోయింది. తోపుడు బళ్లు నడిపేవాళ్లు, ట్యాక్సీ డ్రైవర్లు మంటల్లో చిక్కుకుపోయారు. వాళ్లు బతకడం కష్టమే''అని మరో ప్రత్యక్ష సాక్షి ఇర్ఫాన్ చెప్పారు.

''పేలుడు జరిగిన సెకన్లలోనే అక్కడంతా ఎర్రని పొగ అలుకుముంది. అక్కడున్న వారంతా భయంతో తలోదిక్కు పారిపోయారు. గాయాలతో కిందపడిన చాలా మందిని నేను అప్పటికే వచ్చిన అంబులెన్సుల్లోకి ఎక్కించా''అని ఆయన అన్నారు. ''నేనో ఆటో రిక్షా డ్రైవర్‌ను. సిగ్నల్ వద్ద నా ఆటోకు ముందువైపు కొంచెం దూరంలో ఓ కారు ఆగింది. దాని వెనుకభాగంలోనే పేలుడు సంభవించింది''అని నుదుటికి గాయమైన డ్రైవర్ చెప్పారు.

''పేలుడు తీవ్రతకు నా దుకాణంలోని వస్తువులన్నీ ఒక్కసారిగా కంపించాయి''అని సమీప దుకాణదారుడు వివరించారు. పేలుడు శబ్దం కిలోమీటర్ దూరంలో ఉన్న జామా సమీదు దాకా వినపడింది. పేలుడు ఘటనపై పుకార్లను ప్రచారం చేయొద్దని, సంయమనం పాటించాలని ఢిల్లీవాసులకు రాష్ట్ర మహిళా ముఖ్యమంత్రి రేఖా గుప్తా విజ్ఞప్తిచేశారు.




## మాట్రిమోని వెబ్‌సైట్లు, యాప్స్ పేరుతో మోసాలు పెరుగుతున్నాయ్

(మొదటి పేజీ తరువాయి)

ఆన్‌లైన్‌లో పరిచయం అయిన వ్యక్తిని ప్రత్యక్షంగా కలిసే ముందు కుటుంబ సభ్యుల పరిశీలన ఉండాలని, హఠాత్తుగా ప్రేమ, పెళ్లి, విదేశీ పంపిణి వంటి ప్రతిపాదనలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు స్పష్టం చేశారు. మోసగాళ్లకు అవకాశం ఇవ్వకుండా, మోసపోయిన వెంటనే 1930 హెల్ప్‌లైన్ లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.

సామాజిక మాధ్యమాల వేదికగా వేగంగా వ్యాపిస్తున్న ఈ మ్యాట్రిమోనిలవ్ స్కామ్‌లపై ప్రజలు అప్రమత్తత పాటించాల్సిన అవసరం ఉందని తెలంగాణ పోలీసులు పేర్కొన్నారు.

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌కు ఓటర్లు బుద్ధి చెబుతారు: హరీశ్‌రా-

(మొదటి పేజీ తరువాయి)

కొంతమంది పోలీసులు, అధికారులు కాంగ్రెస్‌కు అనుకూలంగా పనిచేస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. ఈ విషయం మీద ఫిర్యాదులు చేసినా, తక్షణ స్పందన కనిపించలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంత కుట్రలు, ప్రలోభాలు పెట్టినా జూబ్లీ హిల్స్ ఓటర్లు తెలివైన తీర్పుతో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుతారని ధీమా వ్యక్తం చేశారు. ఉపఎన్నికలో జరుగుతున్న అసాంఘిక చర్యలు, సున్నితమైన బూత్‌ల వివరాలను ఎన్నికల సంఘానికి అందజేశామని హరీశ్‌రావు తెలిపారు. ఆ బూత్‌ల వద్ద కేంద్ర భద్రతాబలగాలను నియమించాలని కోరారు. నకిలీ ఓటరు గుర్తింపు కార్డులు తయారీపై సమాచారం, వీడియో ఆధారాలను కూడా ఎన్నికల పరిశీలకులకు అందజేశామని తెలిపారు. మహిళా ఓటర్లకు ప్రత్యేక కౌంటర్‌లు ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘాన్ని అభ్యర్థించారు. ఆరు హామీలపై రెండు సంవత్సరాలుగా సమీక్షలు చేయని ప్రభుత్వం, ఇప్పుడు ఉపఎన్నిక కోసమే సమీక్ష నాటకాలు ఆడుతోందని హరీశ్‌రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. జూబ్లీహిల్స్‌లో ఓటమి భయంతోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అశాంతిగా ప్రవర్తిస్తున్నారని, ప్రజలు ఇప్పటికే కాంగ్రెస్‌ను ఓడించాలని నిర్ణయించుకున్నారని వ్యాఖ్యానించారు.



## మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అజారుద్దీన్




హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ రాజకీయాల్లో కొత్త శకం ఆరంభమైందని చెప్పేలా, టీమిండియా మాజీ కెప్టెన్ మొహమ్మద్ అజారుద్దీన్ సోమవారం మైనార్టీ సంక్షేమం, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖల మంత్రిగా అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. సచివాలయంలోని తన ఛాంబర్‌కి కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి చేరుకున్న అజారుద్దీన్, ముస్లిం మత పెద్దల ప్రార్థనల అనంతరం 'బిస్మిల్లాహ్'తో అధికారి బాధ్యతల పత్రాలపై సంతకం చేశారు. ఛాంబర్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి అధికారులు, పార్టీ నేతలు, సచివాలయ సిబ్బంది హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా మంత్రి అజారుద్దీన్ మాట్లాడుతూ, "నా మీద ఎంతో నమ్మకం ఉంచి ఈ అత్యంత కీలకమైన రెండు శాఖలను అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి హృదయపూర్వక ధన్యవాదాలు. సీఎం ఆశించిన విధంగా, నమ్మకానికి తగిన విధంగా పని చేస్తాను. తెలంగాణ మైనార్టీల సాధికారత, సంక్షేమానికి, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయడానికి కృషి చేస్తాను" అని స్పష్టం చేశారు. తన శాఖల్లో పారదర్శకత, స్పష్టమైన విధానాలు, నూతన ఆవిష్కరణలు, వినూత్న కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు. అజారుద్దీన్ బాధ్యతలు స్వీకరించడం పట్ల సచివాలయం సందడిగా మారింది. అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు వరుసగా ఆయనను అభినందించారు. మైనార్టీల విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, మహిళలు మరియు యువతకు అవకాశాల కల్పనలో అజారుద్దీన్ ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు ఆయన సమీప వర్గాలు సూచిస్తున్నాయి. అదే విధంగా, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖలో నష్టాల్లో ఉన్న సంస్థలను పునరుద్ధరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయనున్నట్లు సమాచారం. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రజల కోసం మరింత సమర్థవంతంగా నడపడం, ఆదాయాన్ని పెంచే మార్గాలను అన్వేషించడం ఆయన ప్రధాన లక్ష్యంగా ఉండనున్నట్లు తెలుస్తోంది.

గమనించదగ్గ విషయమేమిటంటే, గత నెల 31న అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆయన చేత ప్రమాణం చేయించి, నవంబర్ 4న సీఎం రేవంత్ రెడ్డి శాఖలను కేటాయించారు. తెలంగాణ క్రీడా రంగంలో అజారుద్దీన్ ప్రతిష్ట, జాతీయ స్థాయి గుర్తింపు దృష్ట్యా, ఆయన మంత్రిగా ప్రవేశించడంపై ప్రజల్లో కూడా మంచి ఆసక్తి నెలకొంది. ఇప్పుడు అధికారికంగా బాధ్యతలు చేపట్టడంతో, రెండు శాఖల్లో త్వరలోనే చర్యలు, మార్పులు, కొత్త విధానాలు అమలవుతాయనే అంచనాలు పెరుగుతున్నాయి. అధికార వర్గాల అభిప్రాయం ప్రకారం, అజారుద్దీన్ జాతీయ ఖ్యాతి, ప్రజలతో అనుసంధానం, పరిపాలనా తీరు మైనార్టీ సంక్షేమ రంగంలో నూతన మార్పులకు దోహదం చేసే అవకాశం ఉంది. సచివాలయంతో పాటు, ప్రజాసమస్యలను తెలుసుకునేందుకు ఫీల్డ్ విజిట్లు కూడా ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది.



## ప్రజాకవి అందెశ్రీ కన్నుమూత


(మొదటి పేజీ తరువాయి)

అందెశ్రీ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. పాఠశాల చదువు లేకుండానే కవిగా రాణించారు. 'మాయమైపోతున్నడమ్మా' గీతంతో మంచి పేరు తెచ్చుకున్నారు. అందెశ్రీ రాసిన 'జయ జయహే తెలంగాణ'ను రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రగీతంగా గుర్తించిన విషయం తెలిసిందే. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 2025 జూన్ 2న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతులమీదుగా నగదు పురస్కారం అందుకున్నారు.

కాకతీయ విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్ పొందారు.

తెలంగాణ, ప్రకృతి వంటి అంశాలపై అందెశ్రీ గేయరచన చేశారు. ఈయన అశువు కవిత్వం చెప్పటంలో దిట్ట. 2006లో గంగ సినిమాకు గానూ నంది పురస్కారాన్ని అందుకున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయన రచనలు ప్రజలలో చైతన్యం నింపాయి. ఆయన రచనలు, పాటలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి.

2014లో అకాడమి ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్ డాక్టరేట్, 2015లో దాశరథి సాహితీ పురస్కారం, 2015లో రావూరి భరద్వాజ సాహితీ పురస్కారం, 2022లో నకమ్మ జాతీయ పురస్కారం, 2024లో దాశరథీ కృష్ణమాచార్య సాహితీ పురస్కారం, లోక్ నాయక్ పురస్కారం, అదేవిధంగా కాకతీయ యూనివర్సిటీ నుంచి అందెశ్రీ గౌరవ డాక్టరేట్ అందుకున్నారు.




# హైడ్రాకు ప్రజల అండ నగర అభివృద్ధిలో కొత్త విశ్వాసం

(మొదటి పేజీ తరువాయి)

పేదలను కవచంగా ఉపయోగించి బడా బాబులు కబ్జాలు చేసుకునే వ్యవస్థను వెలికితీస్తున్నామని, ఇదే కారణంగా హైడ్రాపై 700, తనపై 31 కంటెంప్ట్ కేసులు పెట్టారని పేర్కొన్నారు. 2024 జూలైకి ముందు నివాసం ఉన్న వారి ఇళ్లపై హైడ్రాకు ఎలాంటి ఉద్దేశం లేదని, తప్పనిసరి పరిస్థితుల్లో చర్యలు తీసుకోవాల్సి వస్తే ప్రత్యామ్నాయం-పరిహారం కల్పించేందుకు ప్రభుత్వానికి నివేదిస్తామని హామీ ఇచ్చారు. హైడ్రా ఏర్పాటు నుంచి నేటివరకు మొత్తం 181 డ్రైవ్‌లు నిర్వహించి 954 కబ్జాలను తొలగించినట్టు కమిషనర్ వెల్లడించారు. దీంతో 1,045.12 ఎకరాల ప్రజా-ప్రభుత్వ భూములను కాపాడారని, వీటి అంచనా విలువ రూ.50,000-55,000 కోట్ల వరకు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ భూములు, రహదారులు, చెరువులు, పార్కులపై చేపట్టిన ఈ చర్యల ఫలితంగా నగరంలో వరద ప్రమాదాన్ని పెద్దఎత్తున తగ్గించగలిగామని అన్నారు. వర్షాకాలానికి ముందుగానే చేపట్టిన నాళాల క్లీనింగ్, క్యాచ్‌పిట్ క్లీరెన్స్ వంటి 96,972 పనులు ఈ ఏడాది వరద ప్రభావాన్ని తగ్గించాయని వివరించారు. నగర చెరువుల పునరుద్ధరణపై కూడా హైడ్రా దృష్టి సారించింది. తొలి విడతలో చేపట్టిన బతుకమ్మకుంటతో పాటు తమ్మిడికుంట, కూకట్‌పల్లి నల్ల చెరువు, పాతబస్తీ బంరుక్‌ఉద్దౌలా చెరువులు త్వరలో ప్రజల వినియోగానికి సిద్ధం కాబోతున్నాయి. చెరువులపై జరుగుతున్న ఆక్రమణలను తొలగించడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పలు కాలనీల వరద ముప్పు తొలగిందని, మరిన్ని చెరువులను ప్రాధాన్యంగా అభివృద్ధి చేయనున్నట్టు కమిషనర్ ప్రకటించారు.

# పార్కులు అదృశ్యం కబ్జాల పెరుగు!

(మొదటి పేజీ తరువాయి)

పార్కులపై అడ్డాలేసి నిర్మాణాలు పెరుగుతుండటంతో, వెంటనే ఫెన్సింగ్ వేసి ప్రజా ఆస్తులను కాపాడాలని వారు వినతి పలికారు. ప్రభుత్వ భూములపై అక్రమాలు, చెరువుల విస్తీర్ణం పెరిగి పై భాగంలోని ఇళ్లు మునిగిపోతున్న సమస్యలను కూడా ప్రజలు వివరించారు. మొత్తం 47 ఫిర్యాదులు అందగా, వాటిని హైడ్రా అదనపు కమిషనర్ ఎన్. అశోక్ కుమార్ పరిశీలించి సంబంధిత అధికారులకు దిశానిర్దేశాలు ఇచ్చారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అల్వాల్ మండలం మచ్చబొల్లారం గ్రామం సర్వే నంబర్ 188లో 30 గుంటల ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతోందని బాలాజీ ఎన్‌క్లేవ్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాంతంలో 60 కాలనీల్లో 60 వేల ఇళ్లు ఉన్న నేపథ్యంలో, ఆ భూమిని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కోసం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.



అమీన్‌పూర్-రావిర్యాలలో చెరువుల విస్తీర్ణం సమస్య

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పెద్ద చెరువు విస్తీర్ణం ఏటా పెరిగి ఎగువన ఉన్న ప్లాట్లు మునిగిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తూముల ద్వారా చెరువులోని నీరు బయటకు వెళ్లేదని, ఇప్పుడు అవి మూసేయడంతో మురుగు, వర్షపు నీరు చెరువులో నిలిచిపోతుందని చెప్పారు. అలుగు ఎత్తు పెరగడంతో ఇబ్బంది మరింత పెరిగిందని, దాన్ని తగ్గించాలి అని కోరారు. ఇదే పరిస్థితి రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని రావిర్యాలలోనూ ఉందని పేర్కొన్నారు.

రావిర్యాలలో లే-ఔట్‌లలో ఖాళీ స్థలాల గోల


రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాల హౌసింగ్ బోర్డు కాలనీలో 545 ప్లాట్ల లే-ఔట్‌లోని ఖాళీ స్థలాలు కబ్జాలకు గురవుతున్నాయని నివాసితులు సమస్యను వివరించారు. పార్కుల్లో మందిరాలు కట్టి, షెడ్డులు వేసి అద్దెలకు ఇస్తున్నారన్నారు. రోడ్లను బ్లాక్ చేసి వ్యక్తిగత వినియోగానికి స్థలాలను దొంగిలిస్తున్నారని వాపోయారు.

ముషీరాబాద్‌లో పిల్లల పార్కు కబ్జా- వ్యాపార కేంద్రాల దందా

ముషీరాబాద్ నియోజకవర్గంలోని బాగ్‌లింగంపల్లి డివిజన్ హౌసింగ్ బోర్డు కాలనీలో పిల్లల పార్కు పూర్తిగా కబ్జాకు గురైందని స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. 1,300 గజాల పార్కు స్థలంలో స్టీల్, ఐరన్ షాపులు, సర్వీసింగ్ సెంటర్లు నడుస్తున్నాయన్నారు. నిరంతరం ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోవడంతో, వెంటనే కబ్జాలను తొలగించి పార్కును పునరుద్ధరించాలన్నారు.

# స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై సుప్రీంలో కోర్టు ధిక్కరణ పిటిషన్

(మొదటి పేజీ తరువాయి)



గతంలో సుప్రీం కోర్టు కూడా ఇదే విషయంపై హెచ్చరించినట్టు బీఆర్ఎస్ గుర్తుచేసింది. ఇంకా ప్రొసీడింగ్స్ సాక్ష్య సేకరణ దశలోనే ఉన్నాయని, దీన్ని కావాలనే లాగుతున్నారని బీఆర్ఎస్ తరఫు న్యాయవాదులు ఆరోపించారు. చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయి పదవీ విరమణ వరకు ఈ ప్రక్రియను కొనసాగించాలని ప్రభుత్వం చూస్తోందని వాదించారు. ఈ వాదనలపై స్పందించిన సుప్రీం కోర్టు, నవంబర్ 24తో సుప్రీం కోర్టు కార్యకలాపాలు ముగిసినట్టుగా భావించడం తప్పు అని స్పష్టం చేసింది. ఈ కేసును వచ్చే సోమవారం విచారణకు తీసుకుంటామని ధర్మాసనం ప్రకటించింది.

# పతంజలి ఫుడ్స్ బంపర్ ఆఫర్..




ప్రముఖ సంస్థ పతంజలి ఫుడ్స్ తన పెట్టుబడిదారులకు శుభవార్త అందించింది. త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో కంపెనీ బోర్డు 202526 ఆర్థిక సంవత్సరానికి మధ్యంతర డివిడెండ్‌ను ఆమోదించింది. ఈ ప్రకటన స్టాక్ మార్కెట్‌లో సానుకూల ప్రభావాన్ని చూపింది. రూ.2 విలువ కలిగిన ప్రతి ఈక్విటీ షేరుపై రూ.1.75 మధ్యంతర డివిడెండ్‌ను కంపెనీ చెల్లిస్తుంది. అంటే మీరు కొన్న ప్రతి షేరుకు కంపెనీ రూ.1.75 ఇస్తుంది. మీ దగ్గర ఎన్ని షేర్లు ఉంటే, ఆ సంఖ్యను రూ.1.75తో గుణిస్తే మీకు వచ్చే మొత్తం తెలుస్తుంది. కంపెనీ ఈ నిర్ణయం వల్ల మొత్తం డివిడెండ్ మొత్తం రూ.59.36 కోట్లుగా ఉంటుంది. ఈ డివిడెండ్ డిసెంబర్ 7 నాటికి పెట్టుబడిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుంది.

డివిడెండ్ పొందాలంటే..

డివిడెండ్‌కు అర్హులైన వాటాదారులను నిర్ణయించడానికి కంపెనీ నవంబర్ 13ను రికార్డు తేదీగా నిర్ణయించింది. ఆ రోజు మీ డీమ్యాట్ ఖాతాలో పతంజలి ఫుడ్స్ షేర్లు ఉంటేనే మీకు డివిడెండ్ వస్తుంది. షేర్లను కొన్న వెంటనే ఖాతాలో జమ అవ్వవు. అందుకే, నవంబర్ 13 కంటే ముందే షేర్లు మీ ఖాతాలో ఉండేలా చూసుకోవాలి.

67శాతం జంప్

డివిడెండ్ ప్రకటనకు ముందు కంపెనీ అద్భుతమైన ఆర్థిక ఫలితాలను నివేదించింది. సెప్టెంబర్‌తో ముగిసిన రెండవ త్రైమాసికంలో కంపెనీ ఏకీకృత నికర లాభం గత ఏడాది ఇదే త్రైమాసికంతో పోలిస్తే ఏకంగా 67 శాతం పెరిగి రూ.516.69 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే సమయంలో ఈ లాభం రూ.308.58 కోట్లుగా ఉంది. కంపెనీ మొత్తం ఆదాయం కూడా గణనీయంగా పెరిగింది. సెప్టెంబర్ 2025 త్రైమాసికంలో ఆదాయం 20.9 శాతం పెరిగి రూ.9,798.80 కోట్లకు చేరుకుంది.

స్టాక్ మార్కెట్‌లో పనితీరు

కంపెనీ ప్రకటన ప్రభావంతో స్టాక్ మార్కెట్‌లో పతంజలి ఫుడ్స్ షేర్లు 1.03 శాతం పెరిగి రూ.578.90 వద్ద ముగిశాయి. గత ఐదు సంవత్సరాలలో, ఈ స్టాక్ తన పెట్టుబడిదారులకు 224శాతం మల్టీబ్యాగర్ ఆదాయాన్ని అందించింది.ఈ బలమైన ఆర్థిక పనితీరు, డివిడెండ్ ప్రకటన, కంపెనీపై పెట్టుబడిదారులలో నమ్మకాన్ని పెంచే అవకాశం ఉంది.

# ఉద్యోగం వదిలితే పీఎఫ్ ఖాతా క్లోజ్ అవుతుందా?

(మొదటి పేజీ తరువాయి)




ప్రభుత్వ సామాజిక భద్రతా సంస్థ అయిన ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ), వ్యవస్థీకృత రంగ ఉద్యోగుల కోసం ప్రావిడెంట్ ఫండ్, పెన్షన్ పథకాలను నిర్వహిస్తుంది. ఉద్యోగం చేస్తున్నప్పుడు, పదవీ విరమణ తర్వాత ఈపీఎఫ్ ఖాతాల నుండి ఉపసంహరణలకు సంబంధించి ఈపీఎఫ్ఓ కొన్ని నియమాలను సవరించింది. కొత్త నిబంధనల ప్రకారం.. ఉద్యోగం కోల్పోయిన తర్వాత లేదా నిరుద్యోగిగా మారిన తర్వాత పీఎఫ్ ఖాతా నుండి 75% బ్యాలెన్స్‌ను ఉపసంహరించుకోవచ్చు. అయితే 25% వెంటనే ఉపసంహరించుకోలేము. దాని కోసం ఒక సంవత్సరం పాటు వేచి ఉండాల్సి ఉంటుంది. కానీ ప్రజల మదిలో మెదులుతున్న ఒక ప్రశ్న ఏమిటంటే, ఉద్యోగం కోల్పోయిన తర్వాత ఈపీఎఫ్‌వో ఖాతాను మూసివేస్తారా? డిపాజిట్లపై వడ్డీ రాదా? నియమాలు ఏమి చెబుతున్నాయో తెలుసుందాం.. ఈపీఎఫ్ నిబంధనల ప్రకారం, మీరు ఒకసారి ఉద్యోగం మారిన తర్వాత మీ సభ్యత్వం గడువు ముగియదు. అంటే మీరు మీ ఉద్యోగాన్ని విడిచిపెట్టిన తర్వాత కూడా మీ ఈపీఎఫ్ సభ్యత్వం కొనసాగుతుంది. మీరు మీ మొత్తం పీఎఫ్ మొత్తాన్ని ఉపసంహరించుకునే వరకు ఇది కొనసాగుతుంది.

**మీకు ఎంతకాలం వడ్డీ లభిస్తుంది?**

మీరు మీ ఉద్యోగాన్ని వదిలివేసి మీ పీఎఫ్ ఖాతాకు ఎటువంటి సహకారాలు జమ కాకపోతే, మీకు మూడు సంవత్సరాల పాటు వడ్డీ అందుతూనే ఉంటుంది. ఈపీఎఫ్ఓ నిబంధనల ప్రకారం.. వరుసగా మూడు సంవత్సరాలు ఖాతాకు ఎటువంటి సహకారం అందించకపోతే ఆ ఖాతాను “నిష్క్రియం”గా పరిగణిస్తారు.

**తర్వాత ఖాతాపై వడ్డీ పెరగడం ఆగిపోతుంది:**

ఉదాహరణకు, ఒక వ్యక్తి జూన్ 2022లో తన ఉద్యోగాన్ని వదిలివేసి ఆ తర్వాత కొత్త విరాళాలు చెల్లించకపోతే జూన్ 2025 వరకు వడ్డీ పెరుగుతూనే ఉంటుంది. ఆ తర్వాత, వడ్డీ ఆగిపోతుంది.

**వడ్డీ చెల్లింపులు:**

నిలిచిపోవడం అంటే మీ డబ్బు పోయిందని అర్థం కాదని అర్థం చేసుకోవడం ముఖ్యం. మీ అసలు, గత వడ్డీ ఈపీఎఫ్ఓలో సేఫ్‌గా ఉంటాయి. ఆన్‌లైన్‌లో క్లెయిమ్ దాఖలు చేయడం ద్వారా మీరు ఎప్పుడైనా ఈ డబ్బును ఉపసంహరించుకోవచ్చు.

**మీరు కొత్త ఉద్యోగంలో చేరితే?**

మీరు కొత్త ఉద్యోగంలో చేరి కొత్త ఈపీఎఫ్ ఖాతాను తెరిస్తే మీ పాత పీఎఫ్ బ్యాలెన్స్‌ను మీ యూఏఎన్ ఉపయోగించి బదిలీ చేయవచ్చు. బదిలీ తర్వాత మీ సభ్యత్వం, విరాళాలు మళ్లీ యాక్టివ్‌గా మారతాయి. ఇది మీ సర్వీస్ వ్యవధి నిరంతరంగా పరిగణించబడటమే కాకుండా మీరు వడ్డీని సంపాదిస్తూనే ఉన్నారని నిర్ధారిస్తుంది.




# జియో స్కీమ్ కీలక ప్రకటన..

◆ **ఎచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంకుల్లోనే భారీ షేర్లు – రూ.500తో ఇన్వెస్ట్ చేసే అవకాశం!**

జియోబ్లాక్‌రాక్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్.. తొలిసారిగా తన పోర్ట్‌ఫోలియోను విడుదల చేసింది. ఈ ఫండ్‌ను సిస్టమేటిక్ యాక్టివ్ ఈక్విటీ విధానం ద్వారా నిర్వహిస్తున్నారు. ఫండ్ తన హోల్డింగ్స్‌లో 141 స్టాక్స్‌ను కలిగి ఉంది. ఇక్కడ హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంకుల్లో అత్యధిక మొత్తం ఇన్వెస్ట్ చేసింది. ఇంకా నగదు రూపంలో 4.52 శాతం ఉంది. ఫండ్ నిర్వహణలోని ఆస్తుల విలువ రూ. 1808 కోట్లుగా ఉంది.మీరు మ్యూచువల్ ఫండ్లలో ఇన్వెస్ట్ చేస్తున్నారా.. అయితే మరి ఎలాంటి పథకాల్ని ఎంచుకుంటున్నారు. ఇటీవల జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, బ్లాక్‌రాక్ సంయుక్త భాగస్వామ్యంలో జియోబ్లాక్‌రాక్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ఏర్పడిన సంగతి తెలిసిందే. ఇది కూడా మ్యూచువల్ ఫండ్ పథకాల్ని లాంఛ్ చేస్తోంది. ఇటీవల జియోబ్లాక్‌రాక్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ అనే తొలి యాక్టివ్ ఈక్విటీ పథకానికి సంబంధించి ఎన్ఎఫ్ఓను లాంఛ్ చేసింది. దీనికి మంచి ఆదరణ కూడా లభిస్తోంది. ఇప్పటివరకు దీనికి సంబంధించి.. పోర్ట్ ఫోలియో వివరాలు ఎక్కడా బయటకు రాలేదు. ఇప్పుడు తొలిసారిగా ఆ ఫండ్.. తన స్టాక్ హోల్డింగ్స్‌ను ప్రకటించింది. ఎన్ఎఫ్ఓ (న్యూ ఫండ్ ఆఫర్) తర్వాత పోర్ట్ ఫోలియో వివరాల్ని వెల్లడించడం ఇదే తొలిసారి. దీని ద్వారా ఏయే స్టాక్స్‌లో ఎక్కువగా పెట్టుబడి పెట్టిందనేది తెలుస్తుంది.ఈ ఫండ్ పోర్ట్‌ఫోలియోలో మొత్తంగా 141 స్టాక్స్ ఉన్నాయి. మరో 4.52 శాతం నికర ఆస్తుల్ని నగదు రూపంలో ఉంది. 2025, అక్టోబర్ 31 నాటికి చూస్తే.. ఫండ్ నిర్వహణలోని ఆస్తుల విలువ మొత్తం (అసెట్స్ అండర్ మేనేజ్‌మెంట్) రూ. 1808 కోట్లుగా ఉంది. ఎన్ఎఫ్ఓ సమయంలో సుమారు రూ. 1500 కోట్ల వరకు నిధుల్ని సమీకరించింది.అత్యధికంగా ఈ ఫండ్.. అతిపెద్ద ప్రైవేట్ బ్యాంక్ అయిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో నికర ఆస్తుల్లో ఎక్కువగా కేటాయించింది. ఇందులోనే 8.87 శాతంగా ఉండటం విశేషం. ఆ తర్వాత ఐసీఐసీఐ బ్యాంకులో 5.42 శాతం పెట్టుబడి పెట్టింది. రిలయన్స్ ఇండస్ట్రీస్‌లో 5.17 శాతం, ఇన్ఫోసిస్‌లో 4.12 శాతం, నిఫ్టీ ఇండెక్స్ లాంగ్ పొజిషన్‌లో 3.84 శాతం, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 3.38 శాతంగా పోర్ట్‌ఫోలియోను కేటాయించింది.ఇక షేర్ల సంఖ్య విషయానికి వస్తే.. అత్యధికంగా టాటా స్టీల్‌లో 18.57 లక్షల షేర్లు ఉన్నాయి. తర్వాత హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో 16.24 లక్షల షేర్లను కలిగి ఉంది. ఐసీఐసీఐ బ్యాంకులో చూస్తే 7.28 లక్షల షేర్లు ఉన్నాయి. ఇతర ముఖ్య హోల్డింగ్స్ విషయానికి వస్తే.. అదానీ పోర్ట్స్ (2 శాతం), మహీంద్రా అండ్ మహీంద్రా (1.06 శాతం), ఎల్ఐసీ (0.83 శాతం), టీవీఎస్ మోటార్ (0.83 శాతం) వాటా ఉంది.ఈ స్కీమ్ విషయానికి వస్తే.. ఇది లార్జ్ క్యాప్, మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేస్తుంది. ఇది ఓపెన్ ఎండెడ్ డైనమిక్ ఈక్విటీ స్కీమ్. నిఫ్టీ 500 ఇండెక్స్ ఈ పథకం పనితీరుకు కొలమానంగా ఉంది. తన్వి కచేరియా, సాహిల్ చౌదరీ ఫండ్ మేనేజర్లుగా ఉన్నారు. ఇక్కడ పెట్టుబడుల కేటాయింపు విషయానికి వస్తే 065 శాతం వరకు ఈక్విటీలో, 035 శాతం వరకు డెట్, మనీ మార్కెట్లలో, 010 శాతం వరకులలో పెట్టుబడి పెడుతుంది. ఇక్కడ కనీస పెట్టుబడి విషయానికి వస్తే.. సిప్ అయినా లంప్‌సమ్ పెట్టుబడి అయినా కనీసం రూ. 500 తో ప్రారంభించొచ్చు. ఆపైన ఎంత మొత్తం అయినా ఇన్వెస్ట్ చేసేందుకు వీలుంటుంది. సిప్ అయితే కనీసం 6 ఇన్‌స్టాల్‌మెంట్స్ చేయాల్సి ఉంటుంది.




# ఐఆర్‌సీటీసీ కొత్త రూల్..

◆ **ఈ ఒక్కటి లేకుంటే ట్రైన్ టికెట్ బుకింగ్ కుదరదు..**

మీరు రైలు ప్రయాణం చేస్తున్నారా.. అయితే ముందుగానే టికెట్లు బుక్ చేసుకుంటారా.. అయితే ఇది మీకోసమే. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల మధ్య టికెట్లు బుక్ చేసుకోవాలనుకుంటే.. కొత్త రూల్ తీసుకొచ్చింది. ఇక్కడ ఆధార్ అథెంటికేషన్‌ను తప్పనిసరి చేసింది. టికెట్ల దుర్వినియోగం జరగకుండా ఇది అడ్డుకుంటుందని రైల్వే శాఖ భావిస్తోంది.భారతదేశంలో రైలు ప్రయాణానికి ఫుల్ డిమాండ్ ఉంటుంది. దూర ప్రాంతాలకు, పర్యటక ప్రాంతాలకు, ఆధ్యాత్మిక ప్రదేశాలకు ఇలా ఎటు వెళ్లాలన్నా ఎక్కువగా ట్రైన్లనే ఎంచుకుంటుంటారు. ఇక్కడ టికెట్ తక్కువగా ఉండటంతో పాటు ప్రయాణం సురక్షితంగా ఉంటుందని భావిస్తుంటారు. అయితే.. ట్రైన్లలో రద్దీ విపరీతంగా ఉంటుందన్న సంగతి తెలిసిందే. ఇంకా పండగలు, ప్రత్యేక సందర్భాల్లో రద్దీ ఇంకా ఎక్కువగా ఉంటుంది. ఇందుకోసం చాలా మంది.. చాలా ముందుగానే టికెట్లు బుక్ చేసుకునేందుకు చూస్తుంటారు. ఇక్కడ కూడా ఎప్పటికప్పుడు రైల్వే శాఖ కొత్త కొత్త రూల్స్ తీసుకొస్తుందని చెప్పొచ్చు. ఇండియన్ రైల్వేస్‌లో ఆన్‌లైన్ రిజర్వేషన్‌ను నిర్వహించే.. ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్. కొత్త రూల్ తీసుకొచ్చింది.ఈ కొత్త రూల్ ప్రకారం.. రిజర్వ్డ్ టికెట్ బుకింగ్స్ ప్రారంభమయ్యే రోజు ఉదయం 8 గంటల నుంచి 10 గంటల మధ్య టికెట్లు బుక్ చేసుకోవాలనుకుంటే.. వినియోగదారులు తప్పనిసరిగా ఆధార్ ప్రామాణీకరణ ( ఆధార్ అథెంటికేషన్ ) పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ రెండు గంటలు సాధారణంగానే అత్యధిక డిమాండ్ ఉన్న స్లాట్. దీంతో ఈ సమయంలో టికెట్ల దుర్వినియోగం లేదా మోసపూరిత బుకింగ్స్‌కు అవకాశం ఉన్నందున.. దీనిని అరికట్టేందుకు ఆధార్ అథెంటికేషన్ ఉపయోగపడుతుందని ఐఆర్‌సీటీసీ భావిస్తోంది.ఇక ఆధార్ అథెంటికేషన్ లేని వినియోగదారులు.. ఉదయం 810 గంటల స్లాట్ తర్వాత టికెట్లను బుక్ చేసుకునేందుకు వీలు ఉంటుంది. కానీ ఉదయం ఆ రెండు గంటల స్లాట్ కేవలం ఆధార్ వెరిఫైడ్ అకౌంట్లకు మాత్రమే పరిమితం. కొత్త నిబంధనలు, ఇతర బుకింగ్ సమయాలపైనా ప్రభావం చూపుతున్నాయి.తత్కాల్ టికెట్లకు (ఆన్‌లైన్) సంబంధించి 2025, జులై 1 నుంచే.. ఆధార్ అథెంటికేషన్‌ను తప్పనిసరి చేసింది.

తత్కాల్ టికెట్లు (ఓటీపీ) ద్వారా 2025, జులై 15 నుంచే పీఆర్ఎస్ కౌంటర్లు, ఏజెంట్ల ద్వారా బుక్ చేసినా ఓటీపీ వెరిఫికేషన్ తప్పనిసరిగా ఉంది.

జనరల్ టికెట్ రిజర్వేషన్‌కు సంబంధించి 2025, అక్టోబర్ 1 నుంచి రిజర్వేషన్ ప్రారంభమైన తొలి 15 నిమిషాల్లో (ఆన్‌లైన్) ఆధార్ అథెంటికేషన్ తప్పనిసరి.పై నిబంధనలు అన్నీ.. ఆన్‌లైన్ బుకింగ్స్‌కు సంబంధించినవే. ఇవి పీఆర్ఎస్ కౌంటర్ల ద్వారా టికెట్లను బుక్ చేసుకునేందుకు వర్తించవు. ఐఆర్‌సీటీసీ ఖాతాతో ఆధార్ లింక్ ఎలా చేయాలో తెలుసుకుందాం. ఇందుకోసం IRCTC వెబ్‌సైట్ లేదా యాప్‌లో లాగిన్ కావాలి. మై అకౌంట్స్ ట్యాబ్‌లోకి వెళ్లి అథెంటికేషన్ యూజర్ ఎంచుకోవాలి. ఆధార్ నంబర్ లేదా వర్చువల్ ఐడీ ఎంటర్ చేయాలి. ఆధార్ ప్రకారం పేరు, డేట్ ఆఫ్ బర్త్, జెండర్ వివరాలు సరిపోతున్నాయో చెక్ చేసుకోవాలి. డీటెయిల్స్ వెరిఫై చేసి రిసీవ్ ఓటీపీపై క్లిక్ చేయాలి. మీ ఆధార్ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీని ఎంటర్ చేయాలి. సబ్మిట్ చేస్తే అథెంటికేషన్ పూర్తవుతుంది. తర్వాత మీరు సదరు రిజర్వేషన్ స్లాట్‌లో టికెట్లు బుక్ చేసుకోవచ్చు.

# బంగారం ధరలకు రెక్కలు..

ఇటీవలి కాలంలో వరుసగా తగ్గుతూ వస్తున్న బంగారం ధర సోమవారం యూటర్న్ తీసుకుంది. ఈ రోజు ఉదయం 9 గంటల తర్వాత బంగారం ధర భారీగా పెరిగింది. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1, 23, 220కి చేరింది . నిన్నటితో పోల్చుకుంటే దాదాపు రూ.1200 పెరిగింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 1, 11, 950కి చేరింది. నిన్నటితో పోల్చుకుంటే దాదాపు రూ.1100 పెరిగింది.ఇటీవల ధర బాగా తగ్గడంతో కొనుగోళ్లు పెరగడమే ఈ పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది . ఇక, ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 23, 370కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 1, 13, 100కి చేరుకుంది.ఇక వెండి ధరల్లో కూడా భారీ పెరుగుదల నమోదైంది. కేజీకి 2,500 రూపాయల మేర వెండి ధర పెరిగింది హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ. 1, 67, 000గా ఉంది. ఇక, ఢిల్లీలో కిలో వెండి ధర రూ.1, 55, 000గా ఉంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

# మానవత్వం చాటుకున్న వేలేరు ఎస్సై సురేష్



**వేలేరు, నవంబర్ 09 (తెలంగాణ ముచ్చట్లు):**

వేలేరు మండలకేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద ప్రమాదవశాత్తు గాయపడిన వ్యక్తిని గమనించిన వేలేరు ఎస్సై సురేష్ వెంటనే స్పందించారు. గాయపడిన వ్యక్తిని తన వాహనంలోనే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి, వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మానవతా దృక్పథంతో వ్యవహరించిన ఎస్సై సురేష్ సేవాభావాన్ని స్థానికులు ప్రశంసించారు.



# ఇక్బాల్ కుటుంబాన్ని పరామర్శించిన పరమేశ్వర్ రెడ్డి

**కాప్రా, నవంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):**

మీర్పేట్ హెచ్.బి. కాలనీ డివిజన్ డైమండ్ హిల్స్ కాలనీకి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఇక్బాల్ తల్లి ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి (ఎంపీఆర్) సోమవారం కుటుంబాన్ని పరామర్శించారు.ఈ సందర్భంగా ఇక్బాల్ కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. వారి కుటుంబం త్వరగా ఈ దుఃఖాన్ని తట్టుకొని ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈకార్యక్రమంలో హెచ్.బి. కాలనీ సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ ముదిరాజ్, కాశెట్టి ప్రసాద్, విట్టల్ నాయక్, అజ్జీద్, కిషోర్, సురేష్ గౌడ్, అలీమ్, సమ్మయ్య, జెమిని, శివ, రాజేష్, శ్రీను, ముర్తజా తదితరులు పాల్గొన్నారు.



# ఎల్కతుర్తి ప్రెస్ క్లబ్ కొత్త అధ్యక్షుడిగా సాతురి చంద్రమౌళి

**ఎల్కతుర్తి నవంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండల కేంద్రంలోని కాకతీయ వనవిహార్‌లో సోమవారం నాడు ప్రెస్ క్లబ్ కొత్త అధ్యక్షుడు మరియు కార్యవర్గ సభ్యుల ఎన్నికలు సజావుగా నిర్వహించబడ్డాయి.

ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులుగా కందుకూరి రాజన్న, అధ్యక్షులుగా సాతూరి చంద్రమౌళి, ఉపాధ్యక్షులుగా చిర్ర ఉదయ్ చందర్, శ్రీ రామోజు సతీష్ చారి, ప్రధాన కార్యదర్శిగా సదా నిరంజన్, సిద్ధాంతి కొలిపాక శ్రీనివాస్, కార్యదర్శిగా జూపాక శ్రీనివాస్, కోశాధికారిగా కందుకూరి మహేశ్వర చారిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా కర్రె తిరుపతి, బెజ్జంకి నరేష్, ఎర్రోళ్ల రాజబాబు, నల్లాల రాజిరెడ్డి, నార్లగిరి మహేందర్ లు ఎంపికయ్యారు.

ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు కందుకూరి రాజన్న, అధ్యక్షులు సాతూరి చంద్రమౌళి మాట్లాడుతూ "జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తాము. మీడియా సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు, రక్షణ కల్పించేందుకు ప్రెస్ క్లబ్ వంతు కృషి చేస్తుం ది" అని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక జర్నలిస్టులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# ధూప దీప నైవేద్య అర్చక సంఘం కార్తీక వనసమారాధన

**ఖమ్మం బ్యూరో, నవంబర్ 10, తెలంగాణ ముచ్చట్లు;**

ఖమ్మం జిల్లా ధూప దీప నివేదన అర్చక సంఘం కార్తీక వన సమారాధన బుధవారం రోజున ఎర్రుపాలెం మండలం జమలాపురం గ్రామం లో మామితోటలో నిర్వహిస్తున్నట్లు ఖమ్మం జిల్లా డిడిఎన్ సంఘం అధ్యక్షులు మునగలేటి రమేష్ శర్మ,ప్రధాన కార్యదర్శి మరింగంటి భార్గవాచార్యులు,కన్వీనర్/ కోశాధికారి అన్నావజ్జల ప్రసాద్ శర్మ సంయుక్త ప్రకటన ద్వార తెలియజేశారు . ఎర్రుపాలెం మండలం డీడీఎన్ అర్చకుల సహకారంతో నిర్వహించే వన సమారాధనకు జిల్లా లోని డీడీఎన్ అర్చకులందరు కుటుంబ సమేతంగా వచ్చి వన సమారాధనను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు

వన సమారాధనలో రుద్రాభిషేకం, సత్యనారాయణ స్వామి అర్చన,సాంస్కృతిక కార్యక్రమాలు మరియు అర్చకుల పడకలపై అవగాహన అర్చకుల సమస్యలపై చర్చలు అర్చక పెద్దలకు సన్మానం కార్యక్రమాలు ఉంటాయని తెలియజేశారు అన్ని మండలాల నుండి అర్చకులు పెద్దఎత్తున తరలిరావాలని విజ్ఞప్తి చేసారు

# తెలంగాణ ఉద్యమ తరహాలో బీసీ రిజర్వేషన్ల ఉద్యమం

- బీసీ రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ జరగాల్సిందే
- పార్టీలకతీతంగా రాజకీయ నాయకులు బీసీ రిజర్వేషన్ల ఉద్యమంలో పాల్గొనాలి.
- వరంగల్ ఉమ్మడి జిల్లా బీసీ జేఏసీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్.



**హసన్ పర్తి, నవంబర్ 10(తెలంగాణ ముచ్చట్లు):**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి పురుడు పోసుకున్న కాకతీయ యూనివర్సిటీ గడ్డ మీద మళ్లీ బీసీ రిజర్వేషన్ల ఉద్యమానికి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర ప్రభుత్వం విద్యా ,ఉద్యోగ,స్థానిక సంస్థల కోటాలో 42 శాతం రిజర్వేషన్ ను కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా తీర్మానం చేసిన బీసీ రిజర్వేషన్ల బిల్లును కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్లో చేర్పించి, బీసీలకు సత్వర న్యాయం చేయాలని మేమేంతో మాకంతా వాటా అంటూ ధర్మంగా పోరాడుతున్న బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలంటే కేంద్ర ప్రభుత్వం వెంటనే రాజ్యాంగ సవరణ చేయాలని బీసీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం కాకతీయ యూనివర్సిటీలోని ఎస్డీఎల్సీ ప్రాంగణంలో బీసీ విద్యార్థి జేఏసీ కాకతీయ యూనివర్సిటీ చైర్మన్ ఆరేగంటి నాగరాజు గౌడ్ నేతృత్వంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలని డిమాండ్ చేస్తూ బీసీ విద్యార్థులు ధర్మదీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బీసీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ధర్మదీక్షను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించినప్పటి నుండి అన్ని రంగాల్లో వెనుకబడిన బీసీ కులస్తులకు రిజర్వేషన్లు లేని కారణంగా బీసీలు అన్ని రంగాల్లో వెనుకబడి,అగ్రవర్ణ రాజకీయ పార్టీల జెండాలు మోసే కార్యకర్తలు గాను, ఓట్లు వేసే యంత్రాలుగాను మిగిలిపోయారన్నారు. దేశంలో అన్ని వర్గాల వారికి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఉంటే,కేవలం బీసీలకు మాత్రం రిజర్వేషన్లు లేని కారణంగా రాజకీయంగా ,ఆర్థికంగా అణచివేతకు గురిచేయబడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.బీసీ విద్యార్థులు చేస్తున్న ధర్మదీక్షతోనైనా కేంద్ర ప్రభుత్వం బీసీలకు రాజ్యాంగపరంగా రిజర్వేషన్లను కల్పించేందుకు ముందుకు రావాలని,లేనియెడల ఉద్యమాన్ని గ్రామస్థాయి నుండి పటిష్టం చేసి,గల్లీ నుండి ఢిల్లీ వరకు పోరుబాట పట్టి కేంద్ర ప్రభుత్వం మెడలు వంచుతామని హెచ్చరించారు.కేయూ పాలకమండలి సభ్యులు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డా.చిర్ర రాజు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం పంతానికి పోయి రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించిన బిల్లును అడ్డుకొని బీసీలకు అన్యాయం చేయొద్దని,బీసీ రిజర్వేషన్లను కల్పిస్తే రాష్ట్ర ప్రభుత్వానికి పేరు వస్తుందని,బిజెపి ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటుందని ఆయన ఆరోపించారు. అగ్రవర్ణ రాజకీయ పార్టీలలోని నాయకులంతా పార్టీలకతీతంగా బీసీ ఉద్యమంలో కలిసి రాకపోతే వారికి రాజకీయ భవిష్యత్తు ఉండదని హెచ్చరించారు. కొందరు అగ్రవర్ణ పార్టీలకు తలొగ్గిన నేతలు బీసీ ఉద్యమాన్ని నీరు కార్చేందుకు కుట్రలు చేస్తున్నారని వారిని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా బీసీ విద్యార్థులు రిజర్వేషన్లను సాధించేందుకు పోరుబాట పట్టారని వారి పోరాటం ఉగ్రరూపం దాల్చకముందే కేంద్ర ప్రభుత్వం వెంటనే దిగివచ్చి బీసీలకు జనాభా దామాషా ప్రకారం చట్టసభలలో రిజర్వేషన్లను కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ ధర్మదీక్షను తెలుగు డిపార్ట్మెంట్ హెచ్ ఓ డి మామిడి లింగయ్య నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు.ఈ కార్యక్రమంలో వరంగల్ ఉమ్మడి బీసీ జేఏసీ వైస్ చైర్మన్లు బోనగాని యాదగిరి గౌడ్, దాడి మల్లయ్య యాదవ్,దొడ్డపల్లి రఘుపతి,బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బచ్చు ఆనందం, రాష్ట్ర కార్యదర్శి భీమగాని యాదగిరి గౌడ్,బీసీ నాయకులు బక్కి అవినాష్,ప్రొఫెసర్లు మండ సారంగపాణి,శ్రీనివాసరావు,ఆకుతోట శ్రీనివాస్, సంఘాని మల్లేశ్వర్,కృష్ణ యాదవ్,సంకినేని వెంకన్న, రమేష్,బీసీ విద్యార్థి నాయకులు సుమన్,అజయ్, గణేష్,రాజశేఖర్,రాజ్ కుమార్,నితిన్,సంజీవ్, రాజేష్,అనిల్,వినోద్,సాయి కృష్ణ,మహేష్, నాగరాజ్ యాదవ్,నాగరాజు పటేల్,చిర్ర సుమన్,వేముల మహేందర్,తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# మహిళ సంఘాల భూమిని కాపాడండి

- హనుమకొండ కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా.
- భూ కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.






**హసన్ పర్తి,నవంబర్ 10(తెలంగాణ ముచ్చట్లు):**

హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం మునిగిపల్లి గ్రామైక్య డ్వాక్రా సభ్యులకు భూములను రక్షించాలని సోమవారం రోజున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్ నాయక్,మునిపల్లె కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు నదునూరి కిషన్ మాట్లాడుతూ 2004వ సంవత్సరంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చింతగట్టు రెవెన్యూ గ్రామ శివారు సర్వేనెంబర్ 120బి,120 సి/1 లలో 12 ఎకరాల 30 గుంటల భూమిని కేటాయించడం జరిగిందని అప్పటి ఎంఆర్ఓ సర్వే చేసి హద్దులు వేయడం జరిగిందని అదేవిధంగా డి ఆర్ డి ఏ ద్వారా మోటరు కరెంటు పోల్స్ వేసి ఆ భూమిలో ఉన్న చెట్లను కొట్టివేసి చదును చేసుకుని పంటలు పండిస్తూ గత 20 సంవత్సరాల నుండి కాస్తులో ఉంటున్నామని గత పది రోజుల క్రితం చింతగట్టుకు చెందిన నద్దునూరి నాగరాజు గ్రామ్యక్య సభ్యుల భూమిలో ఉన్నటువంటి మోటారు కరెంటు స్తంభం ధ్వసం చేసి భూమి చుట్టూ ఫెన్షింగ్ వేసి అందులో ఉన్నటువంటి మట్టిని అమ్ముకుంటున్నారాని మహిళా సంఘాలకు కేటాయించిన భూమిని కబ్జాకు పాల్పడుతున్న నాగరాజు పై క్రిమినల్ కేసు నమోదు చేసి మహిళా సంఘాల సభ్యులకు పట్టా పాస్ బుక్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళ సంఘాల సభ్యులు నదునూరి సరోజన,స్వప్న సులోచన,ఐలమ్మ,స్వరూప,సంధ్య,యమునా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించిన కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్, నవంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు)**





ఉప్పల్ డివిజన్ సమగ్ర అభివృద్ధి కోసం కృషి కొనసాగుతున్నట్టు కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఉప్పల్ డివిజన్ న్యూ విజయపురి కాలనీలో రూ. 1 కోటి 83 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన సోమవారం పరిశీలించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీలో కొత్త మంచినీటి పైప్ లైన్లను త్వరితగతిన ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలు మెరుగు పరిచే పనులు వేగంగా సాగుతున్నాయని అన్నారు.

ఉప్పల్ డివిజన్ను సమస్య లేని ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దడం లక్ష్యంగా కృషి చేస్తున్నామని రజిత పరమేశ్వర్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఈ రాజ్ కుమార్, కాలనీ అధ్యక్షులు వెంకటేశ్, తెల్కల మోహన్ రెడ్డి, నాగి రెడ్డి, పబ్బు నర్సింహ, సల్ల ప్రభాకర్ రెడ్డి, వర్కాల మదన్ గౌడ్, పాపయ్య, శంకరయ్య, పూస సతీష్, భాస్కర్, దానయ్య, నర్సింహ కురుమ, వెంకటేశ్వరరావు, పద్మ, సుమిత్ర, సావిత్రి, అండాలు తదితరులు పాల్గొన్నారు.

# పేరెంటింగ్ క్లాసులు లేకుంటే సమాజం వినాశనమే

**పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు**





**ఖమ్మం బ్యూరో, నవంబర్ 10, తెలంగాణ ముచ్చట్లు;** పిల్లల పెంపకంపై తల్లిదండ్రులకు పేరెంటింగ్ క్లాసులు నిర్వహించడం ద్వారా వినాశనంవైపు వెళుతున్న యువతను సరిదిద్దొచ్చని పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు అన్నారు. మండల పరిధిలోని చొప్పకట్లపాలెంలో పల్లె ప్రపంచం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ నాడునేడురేపు అనే అంశంపై నాలుగవ వారం స్టడీ సర్కిల్ నిర్వహించారు. స్టడీ సర్కిల్ కన్వీనర్ బోయనపల్లి పున్నయ్య అధ్యక్షత వహించారు. ఈ స్టడీ సర్కిల్ లో పల్లా కొండలరావు మాట్లాడుతూ పిల్లలు విలాసం మాత్రమే గాక మాదక ద్రవ్యాలకు మత్తుకు అలవాటు పడుతూ వినాశనం వైపుగా పయనిస్తున్నారని తల్లిదండ్రులు కూడా పిల్లలను సరళంగా సాధారణంగా పెంచడం గాకుండా గారాబం చేస్తూ జల్సాలకు డబ్బులు ఇవ్వడం మంచిది కాదన్నారు. తమ పిల్లలను గొప్పగా పెంచడం అంటే ఆడంబరంగా పెంచడమనే భ్రమలో తల్లిదండ్రులుంటున్నారనీ తమ పిల్లలను తామే చెడు మార్గంవైపు పయనింపజేస్తున్నట్లు తెలుసుకోలేకపోతున్నారన్నారు. చిన్నప్పటి నుండే పిల్లలకు శ్రమ విలువ, ప్రకృతి వనరుల సద్వినియోగంపై అవగాహన పెంచాలనీ, వారికి సరళంగా సాధారణంగా జీవించడమే నేర్పాలని సూచించారు. అలా పెంచితేనే ఏ రకమైన ఒడిదుడుకులనైనా తట్టుకోగలుగుతారని తెలిపారు. ప్రకృతి పదార్థం, మానవ శ్రమ లేకుండా లేకుండా ఏ వస్తువూ రాదని పిల్లలకు నేర్పాలన్నారు. ప్రకృతి వనరుల విధ్వంసం జరుగకుండా ఉండాలంటే పసితనం నుండే పిల్లలకు ప్రకృతి వనరులపై అవగాహన పెంచాలన్నారు. గొప్పలకు,ఆడంబరాలకు పోయి పిల్లల పెంపకంలో జాగ్రత్త వహించకపోతే వారు చెడిపోవడానికి తల్లిదండ్రులే కారణం అవుతున్నారన్నారు. ఈ ధోరణి వల్ల సమాజంలో అనేక పెడదోరణులు వస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ముందుగా పిల్లలను ఎలా పెంచాలనే అంశాలపై నేటి తరం తల్లి,దండ్రులకు పేరెంటింగ్ క్లాసులు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణ హితంగా, సమైక్య భావనతో మనిషి జీవితం, అలవాట్లు ఉండాలని పిల్లలనే కాకుండా అందరూ ఆ దిశగా బాధ్యతగా ఆలోచించేలా ప్రజలలో చైతన్యం పెంచేందుకు కలసికట్టుగా క్రుషి చేయాలని కోరారు. ఈ స్టడీ సర్కిల్ లో పల్లె ప్రపంచం ఫౌండేషన్ కోశాధికారి కొండేటి అప్పారావు, సభ్యులు రచ్చా మధుసూదన్ రావు, మార్కపుడి బ్రహ్మం, కొండేటి ప్రవీణ్, చలమల హరికిషన్ రావు, పరిటాల కొండలరావు, రచ్చా శివరావు, దారెల్లి వెంకటేశ్వర్లు, ఉన్నం వెంకటేశ్వర్లు, నల్లమోతు సాయికుమార్, బొప్పాల రమేష్, బోయనపల్లి సరవయ్య, ఆశ్లేష్, పొట్లపల్లి సహస్ర, కొండేటి నాగమణి, ప్రియాంక, బోయనపల్లి దివ్య, వాణి తదితరులు పాల్గొన్నారు.





# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి..

## జిల్లా కలెక్టర్ డాక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం బ్యూరో, నవంబర్ -10, తెలంగాణ ముచ్చట్లు;** ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఎర్రుపాలెం మండలం రేమిడిచెర్ల గ్రామానికి చెందిన గరికపాటి సరోజిని, తనకు రెండో లిస్టులో ఇందిరమ్మ ఇల్లు మంజూరుకు కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పిడి హౌజింగ్ కి రాస్తూ తగుచర్యలు చేపట్టాలని అన్నారు. స్థానిక పంపింగ్ వెల్ రోడ్ నుండి కొండి రేఖ, తాను ఇంటర్ చదివి, కంప్యూటర్ కోర్సు చేసినట్లు, అవుట్ సోర్సింగ్ లో ఏదేని ఉద్యోగం ఇప్పించగలందులకు కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఖమ్మం డిఆర్డీవో, పిడి మెప్మా, జిల్లా ఉపాధి అధికారులకు తగుచర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఖమ్మం రూరల్ మండలం ఎం. వెంకటాయపాలెం గ్రామం సర్వే నెం. 396లో స్మశాన వాటిక స్థల పరిష్కారం కోరుతూ కుల వివక్ష పోరాట సంఘం, ఖమ్మం జిల్లా కమిటీ దరఖాస్తు చేసుకోగా ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ కి రాస్తూ పరిశీలించి సమస్య పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ఏన్కూరు మండలం, ఏన్కూరు గ్రామానికి చెందిన నున్నా సావిత్రి, తన భర్త నున్నా వెంకయ్య పేర ఉన్నటువంటి వ్యవసాయ భూమిని తనకు తెలియకుండా ఇతరుల పేర పట్టా చేశారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని తనకు భూమి అప్పగించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసీల్దార్ కు రాస్తూ నిబంధన ప్రకారం తగుచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మధిర మండలం నాగవరప్పాడు కు చెందిన వాడకుప్పలా నాగార్జున రావు, తన పొలం సర్వే పూర్తి చేసి, సరిహద్దులను గుర్తించారని, గట్టురాళ్లను వేయించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, మధిర తహసీల్దార్ కు రాస్తూ తగుచర్యకు కలెక్టర్ ఆదేశించారు. నేలకొండపల్లి మండలం గువ్వలగూడెం గ్రామానికి చెందిన అమరనేని అప్పయ్య, తన కుమారుల నుండి మనోవర్తి కోరుతూ దరఖాస్తు చేయగా, జిల్లా సంక్షేమ అధికారికి తగుచర్యకై కలెక్టర్ ఆదేశించారు. ఇట్టి ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ ఏ. పద్మశ్రీ , డిఆర్డీవో ఎన్. సన్యాసయ్య, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# ఎమ్మార్వో కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

## ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**మల్కాజ్‌గిరి, నవంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):**

మల్కాజ్‌గిరి ఎమ్మార్వో కార్యాలయంలో నిర్వహించిన కళ్యాణ లక్ష్మి - షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు చెక్కులను స్వయంగా అందజేశారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన ఈ పథకాలు లక్షలాది పేద కుటుంబాలకు ఆశీర్వాదంగా నిలిచాయని గుర్తు చేశారు. సామాజిక న్యాయం, ఆర్థిక భద్రత, మహిళా సాధికారతకు ఈ పథకాలు ప్రతీకలని తెలిపారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాలను కొనసాగిస్తుండడం సంతోషకరమని, "లబ్ధిదారులకు చెక్కులతో పాటు తులం బంగారం ఇస్తానన్న హామీని ప్రభుత్వం నెరవేర్చాలని" ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అనంత లక్ష్మి, మల్కాజ్‌గిరి తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, గౌతమ్‌నగర్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, చిన్న యాదవ్, అమీనుద్దీన్, శివ గౌడ్, చిందం శ్రీనివాస్, శంకర్ రావు, హేమంత్ పటేల్, శోభ, ఉస్మాన్, మారుతి ప్రసాద్, రాజు, జనార్ధన్, వెంకటేష్, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమానికి స్థానిక ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

# పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు

## విత్తన మొక్కజొన్నపై రైతులకు అవగాహన...

**ఖమ్మం బ్యూరో,నవంబర్ 10, తెలంగాణ ముచ్చట్లు;**

సోమవారం వైరా మండలం గరికపాడు, దాచాపురం ధాన్యం కొనుగోలు కేంద్రాలను వైరా డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ మట్టూరి వెంకటేశ్వర్ రావు , మరియు సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు పూర్తిగా ఆరబెట్టిన ధాన్యాన్ని మిల్లులకు పంపవలసిందిగా రైతులకు తెలియజేశారు. గన్నీ రమ్మీ సంచులు అందుబాటులో ఉంచుకోవాలని సొసైటీ వారికి తెలియజేశారు. ఈ



కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మంజూఖాన్ వ్యవసాయ విస్తరణ అధికారి సైదులు, సొసైటీ సీఈఓ అంజయ్య సొసైటీ డైరెక్టర్లు అదేవిధంగా సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

**విత్తన మొక్కజొన్నపై రైతులకు అవగాహన...**

అదేవిధంగా గరికపాడు లింగన్నపాలెం గ్రామంలో విత్తన మొక్కజొన్న వేసే రైతులకు అగ్రిమెంటు లేకుండా కంపెనీ వారు ఇచ్చే మొక్కజొన్నని వేయకూడదని సూచించారు. అగ్రిమెంటు ఉంటేనే మొక్కజొన్న వేసేలా రైతులకు తెలియజేశారు. రైతులకు నష్టం రాకుండా అగ్రిమెంట్ తీసుకొని విత్తన మొక్కజొన్న వేసుకోవాలని ఆత్మ కమిటీ చైర్మన్, మండల వ్యవసాయ అధికారి మాయన్ మంజుఖాన్ తెలియజేశారు.





# డాక్టర్ మాధవ రెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ భూమి పూజ చేసిన చిన్నారెడ్డి

**వనపర్తి,నవంబర్10(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి నియోజకవర్గంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ప్రత్యేక చొరవతో, ఆరు గ్రామాలు మరియు 13 గిరిజన తాండాల్లో దాదాపు 5,000 ఎకరాలకు సాగు నీరు అందించే కాశీంనగర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

మార్చి 2న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వనపర్తి బహిరంగ సభలో, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించిన సందర్భంలో డాక్టర్ జిల్లెల మాధవ రెడ్డి పేరును అధికారికంగా ఖరారు చేశారు. సభలో హర్షధ్వనులు హోరెత్తాయి.

సోమవారం ప్రాజెక్ట్ సర్వే పనులకు డాక్టర్ చిన్నారెడ్డి భూమి పూజ నిర్వహించారు.

చిన్నారెడ్డి మాట్లాడుతూ.. జూరాల, కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్, బీమా ఇరిగేషన్ ప్రాజెక్టుల ద్వారా ఈ ప్రాంతానికి సాగు నీరు అందలేదు. కాశీంనగర్, జయన్న తిరుమలాపురం, మున్ననూరు, అప్పాయిపల్లి, దత్తయిపల్లి, అంజనగిరి గ్రామాలు మరియు 13 గిరిజన తాండాలకు సాగునీరు అందించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని కోరగా, డాక్టర్ మాధవ రెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ద్వారా మొత్తం 5,000 ఎకరాలకు సాగునీరు అందించాలని మంజూరు అయ్యిందని తెలిపారు.

ప్రాజెక్ట్ బి8 నుంచి రామన్న గట్టు రిజర్వాయర్ కు నీళ్లు తేవడం ద్వారా అమలు చేయబడుతుంది. అక్కడి నుంచి మూడు లిఫ్ట్ ల ద్వారా సాగునీరు పంపిణీ చేయబడుతుంది. మొదటి లిఫ్ట్ ద్వారా కాశీంనగర్ ప్రాంతానికి 1,000 ఎకరాలకు, రెండో లిఫ్ట్ ద్వారా దత్తయిపల్లి మరియు అంజనగిరి ప్రాంతాలకు 1,000 ఎకరాలకు, మూడో లిఫ్ట్ ద్వారా జయన్న తిరుమలాపురం, మున్ననూరు, అప్పాయిపల్లి మరియు దత్తయిపల్లి ప్రాంతాలకు 3,000 ఎకరాలకు సాగునీరు అందుతుంది.

సర్వే పనులకు ప్రభుత్వం 22 లక్షల రూపాయలు మంజూరు చేసింది. సర్వే పూర్తయిన తర్వాత డిపిఆర్ కు సమర్పించి, ఆమోదం పొందిన తరువాత లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ప్రారంభం కానున్నాయి.

చిన్నారెడ్డి ప్రాజెక్ట్ త్వరగా పూర్తి చేసి రైతులందరికీ సాగునీరు అందించాలని, ప్రాజెక్ట్ కు డాక్టర్ మాధవ రెడ్డి పేరును మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మరియు ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాములు, నందిమల్ల రాము, కాశీంనగర్ రైతులు, పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు తదితరులు పాల్గొన్నారు.

# సాయి బాబు కుటుంబాన్ని ఆదుకుంటాం పిల్లల చదువు బాధ్యత నా దే పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్, నవంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు)**

ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి సాయి బాబు కుటుంబానికి అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు.ఉప్పల్‌లోని ఇందిరా నగర్‌కు చెందిన వెల్దండ సాయి బాబు మూడు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్యతో పాటు ముగ్గురు చిన్న పిల్లలు ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న పరమేశ్వర్ రెడ్డి సోమవారం స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి కుటుంబాన్ని పరామర్శించారు.కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్న ఆయన, చిన్న వయసులోనే సాయి బాబు మృతి చెందడం ఎంతో బాధాకరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన సాయి బాబు కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయాన్ని అందించి, ముగ్గురు పిల్లల విద్యాభారాన్ని తన సొంత ఖర్చుతో భరించనున్నట్లు తెలిపారు.ఈ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుంది" అని పరమేశ్వర్ రెడ్డి భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బాకారం లక్ష్మణ్, లింగంపల్లి రామకృష్ణ, తోకట రాజు, మద్దూరి కుమార్, గంజాయి ప్రకాష్, ఎల్లండా రాజు, డప్పు నందు, ఒక్కస్ నరేందర్, అలుగుల అనీల్ కుమార్, మండల నాగరాజు, జాజర్ల సాయికుమార్, తోకట రాము, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# వైరా క్రాంతి జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రముఖ కవి అందెశ్రీ కి ఘన నివాళి...

**ఖమ్మం బ్యూరో ,నవంబర్ 10, తెలంగాణ ముచ్చట్లు;**

వైరా స్థానిక క్రాంతి జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రముఖ కవి అందెశ్రీ కి సంతాపం తెలియజేశారు.

ఈ సందర్భంగా అందెశ్రీ చిత్రపటానికి విద్యాసంస్థలు చైర్మన్ వాసిరెడ్డి సునీత కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కరెస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజలను జాగృతి పరచడంలో అందెశ్రీ కీలకపాత్ర వహించారని తెలంగాణ ఉద్యమ సమయంలో అనేక గేయాలను రచించి ప్రజలలో చైతన్యాన్ని నింపి తెలంగాణ సాధన కోసం నిరంతరం ప్రయత్నం చేశారని అన్నారు.. ఆయన రచించిన జయ జయహే తెలంగాణ మరియు మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు అనే రచనలు ప్రజల్లో చిరస్థాయిగా నిలిచి పోతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ సంయోగిత ఎన్ఎస్ఎస్ పి ఓ లింగారావు, అధ్యాపకులు మజీదు, వేణు, చైతన్య,రామకృష్ణ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు...




# ఎల్కతుర్తి మండల టెన్త్ విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లించిన కేంద్ర మంత్రి బండి సంజయ్

**ఎల్కతుర్తి నవంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు)**

కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా ఫీజులను స్వయంగా భరించారు. 'మోదీ గిఫ్ట్' పేరుతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన బండి సంజయ్, తన వేతన డబ్బులతో విద్యార్థుల పరీక్షా ఫీజు మొత్తాన్ని చెల్లించారు. ఈ మేరకు హన్మకొండ జిల్లా పరిధిలోని ఎల్కతుర్తి మండల విద్యార్థుల ఫీజు మొత్తానికి సంబంధించిన చెక్కును జిల్లా కలెక్టర్‌కు బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి, గంగాడి కృష్ణారెడ్డి, ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ కలిసి అందజేశారు.

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి మాట్లాడుతూ —

"కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ ఈ ఏడాది పరీక్ష ఫీజును పూర్తిగా చెల్లించేందుకు బండి సంజయ్ నిర్ణయం తీసుకున్నారు. దీనికి అనుగుణంగా ఆయా జిల్లాల కలెక్టర్లకు ఇప్పటికే లేఖలు పంపించారు," అని తెలిపారు.

అతను ఇంకా మాట్లాడుతూ, "ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులలో ఎక్కువమంది ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన వారే. వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు బండి సంజయ్ గారు ముందుకు రావడం అభినందనీయమైంది," అన్నారు.

మండల స్థాయిలో ఈ కార్యక్రమం పట్ల బీజేపీ కార్యకర్తలు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU

తెలుగు దిన పత్రిక

# పింఛన్ లేక ఆర్థిక ఇబ్బందులు కలెక్టర్ దృష్టికి లలిత ఆవేదన

**మహబూబునగర్,నవంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):**



అడ్డాకల్ మండలం బలీదుపల్లి గ్రామానికి చెందిన మంద లలిత తన భర్త మరణించి మూడు సంవత్సరాలు గడిచినా ఇప్పటివరకు ప్రభుత్వం నుండి వితంతు పింఛన్ మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఒంటరిగా జీవనోపాధి లేని పరిస్థితుల్లో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని ఆమె తెలిపింది.

ఈ మేరకు లలిత జిల్లా ప్రజావాణి లో మహబూబ్నగర్ జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి కి ఫిర్యాదు చేసింది.

ఆమె విన్నపాన్ని గమనించిన కలెక్టర్ వెంటనే డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ నరసింహులను దరఖాస్తు పరిశీలించమని ఆదేశించారు.

కలెక్టర్ సూచనలతో నరసింహులు అడ్డాకల్ మండలం ఏపీఎం మహేష్ కు చరవాణి ద్వారా మంద లలితను మహిళా సంఘం గ్రూపులో చేర్చించి, సంఘం ద్వారా రుణం మంజూరు చేయాలని ఆదేశించారు.

అలాగే ప్రభుత్వం నుండి లలితకు వితంతు పింఛన్ త్వరితగతిన మంజూరు చేయిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు.

ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు గడిచిన పింఛన్ దరఖాస్తులు స్వీకరించిన కొత్త పింఛన్లు మంజూరు కాకడపోవడంతో రాష్ట్రంలో లలిత లాంటి ఎంతో మంది మహిళలు భర్తలు లేక ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతూ.. పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి ఏర్పడింది. ఇకనైనా ప్రభుత్వం పింఛన్ మంజూరు కోసం చర్యలు చేపట్టాలని మహిళలు కోరుతున్నారు.



# బియ్యంలో పురుగులు విద్యార్థుల ఆరోగ్యానికి ముప్పు

- **ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఆవేదన వ్యక్తం చేసిన ఉన్నికృష్ణన్**

**మేడ్చల్, నవంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):**

మధ్యాహ్న భోజన పథకానికి ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యంలో పురుగులు, దుమ్ము, చెత్త కలిసివున్నట్లు మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా కార్మికులు ఆరోపించారు.

ఇలాంటి నాసిరకమైన బియ్యంతో విద్యార్థులకు భోజనం వండితే వారి ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఉన్నికృష్ణన్ హెచ్చరించారు. "విద్యార్థులు అనారోగ్యానికి గురైతే దానికి బాధ్యత ఎవరి మీద?" అని ఆయన ప్రశ్నించారు. తక్షణమే నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని, ఈ నిర్లక్ష్య వైఖరి కొనసాగితే జిల్లా స్థాయిలో నిరసనలు చేపడతామని హెచ్చరించారు.ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యం పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించాలని ఉన్నికృష్ణన్ డిమాండ్ చేశారు.

# మధ్యాహ్న భోజన కార్మికులపై నిర్లక్ష్యం..

- **వేతనాలు, గుడ్ల బిల్లులు వెంటనే చెల్లించాలి ఉన్నికృష్ణన్**

**మేడ్చల్, నవంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):**

మధ్యాహ్న భోజన పథకం అమల్లో ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యం పట్ల కార్మికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఉన్నికృష్ణన్ తెలిపారు.



గత ఆరు నెలలుగా కార్మికుల వేతనాలు,నిర్వహణ బిల్లులు, పది నెలల కోడి గుడ్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు "బిల్లులు క్లియర్‌లో ఉన్నాయి" అంటూ చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం గ్రీన్ ఛానల్ ద్వారా కార్మికుల వ్యక్తిగత ఖాతాల్లో బిల్లులు జమ చేయాలని డిమాండ్ చేశారు.

మధ్యాహ్న భోజనం వండడానికి కట్టెల పొయ్యి వాడొద్దని అధికారులు చెబుతున్నప్పటికీ, గ్యాస్ సిలిండర్లు మాత్రం కార్మికులే కొనాలని చెబుతుండటం అన్యాయమని ఉన్నికృష్ణన్ అన్నారు. "మేము గ్యాస్‌ను వ్యక్తిగత అవసరాలకు కాదు, విద్యార్థుల వంటకానికే వాడుతున్నాం" అని ఆయన స్పష్టం చేశారు.కొత్త మెనూ విషయంలో కూడా ప్రభుత్వం కార్మికులను ఇబ్బందుల్లోకి నెడుతోందని విమర్శించారు. పాత బడ్జెట్‌తో కొత్త మెనూను వండడం సాధ్యం కాదని, అదనపు పనికి అదనపు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు, మెనూ ఛార్జీలను పెంచాలని, గుడ్ల సరఫరా బాధ్యతను ప్రభుత్వం స్వయంగా చేపట్టాలని సూచించారు.

# ఆగని చోరీలు,రెచ్చిపోతున్న దొంగలు

**వేలేరు, నవంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):**

వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామంలో దొంగతనాల పరంపర కొనసాగుతోంది. గ్రామంలో తరచుగా జరుగుతున్న దొంగతనాలు స్థానికుల్లో భయాందోళనలకు కారణమవుతున్నాయి.గ్రామానికి చెందిన బొజ్జ రాజు (48)కు చెందిన వ్యవసాయ బావి వద్ద నిలిపిన మూడు గొర్రెపోతులు, మూడు మేకపోతులను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు సమాచారం. దొంగిలించబడిన పశువుల విలువ సుమారు రూ.1.20 లక్షలుగా అంచనా వేయబడింది.గతంలోనూ ఇదే రైతు వద్ద అక్టోబర్ 4న నాలుగు పొట్టేళ్లు, నాలుగు మేకలు, నాలుగు గొర్రెలు దొంగిలించబడిన ఘటన చోటుచేసుకుంది. పునరావృతమవుతున్న ఈ సంఘటనలతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ తాజా ఘటనపై వేలేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం.





# ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి...

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**ఖమ్మం బ్యూరో, నవంబర్- 10, తెలంగాణ ముచ్చట్లు;** ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో ప్రాధాన్యత కార్యక్రమాల అమలుపై అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, దినపత్రికలలో ప్రచురితమవుతున్న వ్యతిరేక వార్తలకు సంబంధిత అధికారులు తీసుకున్న చర్యలపై నివేదికలు సమర్పించాలన్నారు. 83 వ్యతిరేక వార్తలకు వివిధ శాఖల నుండి తీసుకున్న చర్యల నివేదికలు రావాల్సి ఉందని, వారాంతంలోగా నివేదిక సమర్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కి సంబంధించి వివిధ శాఖలకు సంబంధించి, ప్రజల నుండి 201 దరఖాస్తులకు పరిష్కారం పెండింగ్ లో ఉన్నాయని, యుద్ధప్రాతిపదికన వచ్చే శనివారం లోగా దరఖాస్తుల పరిష్కారం చేయాలని కలెక్టర్ అన్నారు. మంత్రుల నుండి ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించి వివిధ శాఖల నుండి 152 దరఖాస్తులకు గాను, 21 దరఖాస్తులకు చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ అన్నారు. నిబంధనల మేరకు దరఖాస్తుల పరిష్కారం చేయాలని, ప్రభుత్వానికి పరిష్కారం కోసం నివేదించాల్సి ఉంటే నివేదించాలని, పరిష్కారం కాని వాటిని కారణం తెలుపుతూ తిరస్కరించాలని అన్నారు. సీఎం ప్రజావాణి కి సంబంధించి దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలన్నారు. పరిష్కారం సహేతుకంగా, న్యాయబద్ధంగా చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. అధికారులు, సిబ్బంది హాజరు వారం వారం సమీక్ష చేయాలని జిల్లా రెవెన్యూ అధికారిణి ని కలెక్టర్ ఆదేశించారు. రోజువారీ హాజరును గ్రూప్ లో పోస్ట్ చేస్తూ, హాజరు శాతంను సమీక్షించాలన్నారు. ధాన్యం, పత్తి, మొక్కజొన్న కొనుగోలు ను మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ అన్నారు. ప్రత్యేక అధికారులు ప్రతి శుక్రవారం ధాన్య కొనుగోలు కేంద్రాలను సందర్శించి, నిబంధనల మేరకు, కొనుగోలు ప్రక్రియ సజావుగా జరుగుతున్నది పర్యవేక్షించాలన్నారు. సమస్యలు ఉంటే, అక్కడికక్కడే పరిష్కరించాలని, పరిష్కారం కానిచో వెంటనే దృష్టికి తేవాలని కలెక్టర్ తెలిపారు. ప్రత్యేక అధికారులు తమ సందర్శనలో ఎంత మేర ధాన్యం కొనుగోలు చేసింది, ఎంత మేర రవాణా చేసింది, ఎంత మేర మిల్లర్లు దిగుబడి చేసుకుంది, ఎంతమేర ట్యాబ్ ఎంట్రీ ఎంత మేర జరిగింది పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రత్యేక అధికారుల తనిఖీకి సంబంధించి చెక్ లిస్ట్ రూపొందించాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు ప్రభుత్వ గురుకులాల, పాఠశాలల సందర్శన చేయాలన్నారు. అధికారులు మధ్యాహ్న భోజనం అక్కడే చేయాలని భోజన నాణ్యత ను పరిశీలించాలని అన్నారు. పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, అధికారులు ఈ దిశగా పర్యవేక్షణ చేయాలని, సమస్యలు ఉంటే దృష్టికి తేవాలని అన్నారు. భూ భారతి దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలన్నారు. పెండింగ్ ఎక్కువగా వున్న మండలాలకు సిబ్బందిని డిప్యుటేషన్ పంపి, వేగంగా పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. 1 నుండి 5వ తరగతి పిల్లల్లో పఠనా శక్తిని పెంపొందించడానికి ఎవ్రీ చైల్డ్ రీడ్ కార్యక్రమాన్ని జిల్లాలో అమలు చేస్తున్నామన్నారు. పిల్లల పురోగతిని యాప్ ద్వారా ప్రతి బుధవారం సమీక్షిస్తున్నట్లు తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు పాఠశాలల్లో ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమ అమలు, యాప్ లో ప్రతి బుధవారం నమోదుకు పర్యవేక్షించాలని, పిల్లల పురోగతిని పరిశీలించాలని అన్నారు. ఎంత మంది పిల్లలు వర్డ్, లెటర్, వాక్యం స్థాయిలో ఉన్నది పరిశీలించి, ప్రతి పిల్లవాడు వాక్యం చదివే స్థాయికి చేరుకునేలా కార్యాచరణ చేయాలన్నారు.

జిల్లాలో మిగులు రెండు పడకల ఇండ్లను లబ్ధిదారులకు కేటాయించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇటీవల భారీ వర్షాలకు సంబంధించి జరిగిన నష్టం నివేదికలను సంబంధిత అధికారులు వెంటనే సమర్పించాలన్నారు. ఈ సమీక్ష లో జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ, డిఆర్డీవో ఎన్. సన్యాసయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# దుమ్ము రేపుతున్న తల్లాడ రింగురోడ్డు...

- **పట్టించుకునే నాధుడే లేడు..**
- **దిక్కు మొక్కు లేని తల్లాడ..**
- **ఎన్ని ప్రభుత్వాలు మారినా..**
- **మారిని తల్లాడ కేంద్రంలో పరిస్థితి..**

**ఖమ్మం బ్యూరో,నవంబర్ 10 , తెలంగాణ ముచ్చట్లు:**

తల్లాడ రింగు రోడ్డు సెంటర్లో గుంతలు పడి నీళ్లు నిలిచి తటాఖంలో మారింది, తరచూ భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో, గుంతలు పెద్దవై, వాహనాచౌదకులకు ఆశనిపాతం లా మారాయి, గుంతలను ఎన్ హెచ్ ఫోర్ అధికారులు పూడ్చే పరిస్థితి లేకపోవడంతో ఎస్సై సొరవతో కంకర గుంతలలో నింపారు, ఉష్ణోగ్రత పెరిగినప్పుడు దుమ్ము ఇటు పోలీస్స్టేషన్, కొత్తగూడెం వైపు అటవీ శాఖ చెక్ పోస్ట్ వరకు, బస్టాండ్ వైపు మట్టమహోటల్ వరకు, దుమ్ము వెదజల్లుతోంది, ముక్కు మూసుకోకుండా రింగ్ రోడ్డు దాటే పరిస్థితి లేదు, డివైడర్లు లేవు, సెంట్రల్ లైటింగ్ లేదు, డివైడర్లకు ఫెన్సింగ్ లేదు , డ్రైనేజీలు లేవు, మట్టమ్మ హోటల్ నిర్వాహకులు ఒక రిక్షా ఏర్పాటు చేసుకొని రెండు రమ్ములలో డ్రైనేజీ వాటర్ ను తరలించాల్సిన దౌర్భాగ్య పరిస్థితి తల్లాడలో చోటుచేసుకుంది, ఇద్దరు మంత్రులు తరచూ తల్లాడ రింగురోడ్డు నుండే రాకపోకలు సాగిస్తున్నారు, స్థానిక శాసన సభ్యురాలు ఇదే రహదారి గుండా ప్రయాణిస్తుంటారు, అయినా ఎవరు ఈ సమస్యను పరిష్కరించే దిశగా ప్రయత్నించడం లేదు, తల్లాడ అభివృద్ధి కోసం అడిగే నాధుడే లేడు, గత ప్రభుత్వం మారిన ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్నా, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా, పరిస్థితి ఉంది, పక్క మండలాలైనా వైరా, ఏనుకూరు, కల్లూరు అభివృద్ధి దశలో పరుగులు పెడుతున్నాయి, తల్లాడ మండల కేంద్రం జంక్షన్ రాజమండ్రి కాకినాడ, ఇటు భద్రాచలం చత్తీస్గడ్, హైదరాబాద్ వాహనాలు ఇటువైపునుండే రాకపోకలు సాగిస్తున్నాయి, మా మండలానికి ఇది కావాలి



అని అడిగే నాధుడే లేడు, పట్టించుకునే అధికారులు లేరు, తల్లాడ అనాధగా మిగిలింది, రింగ్ రోడ్డు సెంటర్లో ఇటీవల లారీ బోల్తా పడింది, ఘోర ప్రమాదాలు జరిగే అవకాశం పొంచిఉంది, ఎన్ హెచ్ ఫోర్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు చూస్తున్నారే తప్ప, బొచ్చుడు కంకర పూసిన పాపాన పోలేదు, ఇకనైనా మంత్రు లో, శాసనసభ్యురా లో, అధికారు లో స్పందించి, రింగ్ రోడ్డు నిడివి తగ్గించి, వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా, రింగు సెంటర్ ను శాశ్వత ప్రాతిపదికన రోడ్డు నిర్మించి డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేసి రింగురోడ్డు ను అభివృద్ధి చేయాలని వాహనచోదకులు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు,






# మోడల్ స్కూల్ 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ

**ఎల్కతుర్తి, నవంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):**

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో చదువుతున్న 83 మంది పదవ తరగతి విద్యార్థులకు గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు.

హుజురాబాద్‌కు చెందిన ట్రస్ట్ నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్ ఈ కార్యక్రమంలో పాల్గొని, పాఠశాల ప్రిన్సిపాల్ దేవులపల్లి శ్రీకాంత్ చేతుల మీదుగా విద్యార్థులకు ప్యాడ్లు అందజేశారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, "నా తల్లి పేరుతో ఏర్పాటు చేసిన ట్రస్ట్ ద్వారా ప్రతి సంవత్సరం పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందించడం అభినందనీయ విషయం. విద్యార్థులు కూడా కృషి చేసి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరి ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయాలి" అని సూచించారు.

ట్రస్ట్ నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్ మాట్లాడుతూ, "2011 సంవత్సరం నుండి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందిస్తున్నాను. అలాగే గణిత, సైన్స్ టాలెంట్ టెస్టులు నిర్వహించి బహుమతులు, మెరిట్ అవార్డులు కూడా అందజేస్తున్నాను" అని తెలిపారు.

అధ్యాపక బృందం మాట్లాడుతూ, "మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం చేస్తున్న సేవలు నిజంగా ప్రశంసనీయం" అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రాచకొండ కమిషనరేట్ పరిధిలో సిటీ ట్రైనింగ్ సెంటర్‌కు శంఖుస్థాపన

- **భరోసా, కమాండ్ కంట్రోల్ సెంటర్‌లకు డిజిపి శివధర్ రెడ్డి ప్రారంభం**

**హైదరాబాద్, నవంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):**
రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ బి.శివధర్ రెడ్డి రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మేడిపల్లిలో నిర్మించనున్న సిటీ ట్రైనింగ్ సెంటర్ (సిటిసి) కు సోమవారం నాడు శంఖుస్థాపన చేశారు. అదేవిధంగా, సరూర్‌నగర్‌లో నిర్మించిన భరోసా మరియు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో రాచకొండ పోలీస్ కమిషనర్ జి.సుధీర్ బాబు, డిసిపీలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అనంతరం మేడిపల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడిన డిజిపి శివధర్ రెడ్డి మాట్లాడుతూ
దివీస్ లేబరేటరీస్ లిమిటెడ్ సిఎస్ఆర్ నిధులతో సిటీ ట్రైనింగ్ సెంటర్ నిర్మాణం చేపట్టడం అభినందనీయమని అన్నారు. పోలీస్ సిబ్బంది పిల్లల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనున్న యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ నిర్మాణానికి కూడా దివీస్ సంస్థ సిఎస్ఆర్ పథకం ద్వారా సహాయం చేయనున్నట్లు వెల్లడించారు.సిటీ ట్రైనింగ్ సెంటర్ నిర్మాణంతో పోలీస్ సిబ్బందికి వివిధ రకాల శిక్షణా కార్యక్రమాలు నిర్వహించవచ్చని చెప్పారు. సాంకేతిక నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో పోలీసులకు ఆధునిక శిక్షణ అవసరమని అభిప్రాయపడ్డారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు డ్రైవర్లు బాధ్యతాయుతంగా నడవాలని, వచ్చే నెల "సజీవంగా చేరుకోండి" పేరిట పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు మాట్లాడుతూ, దివీస్ లేబరేటరీస్ సంస్థ సిటిసి నిర్మాణానికి ముందుకు రావడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. మంచి వాతావరణంలో పోలీస్ సిబ్బందికి శిక్షణ అందించేందుకు సిటిసి దోహదం చేస్తుందని పేర్కొన్నారు. దివీస్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ డి.మధుబాబు, జీఎం సుబ్బారావు పోలీస్ శాఖకు అవసరమైన సహాయం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని తెలిపారు. రాచకొండ సైబర్ సెక్యూరిటీ కౌన్సిల్ ప్రతినిధి గగన్ దీప్, కమిషనరేట్ పరిధిలోని డిసిపీలు, అదనపు డిసిపీలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



**మహిళల భద్రత కోసమే భరోసా కేంద్రాలు : డిజిపి**

రాచకొండ పరిధిలోని సరూర్‌నగర్‌లో నిర్మించిన భరోసా సెంటర్‌ను డిజిపి బి.శివధర్ రెడ్డి ప్రారంభించారు. మహిళల భద్రత కోసం భరోసా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మహిళా బాధితులకు చట్టబద్ధ రక్షణ, కౌన్సిలింగ్ సదుపాయాలు అందించేందుకు ఈ కేంద్రాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాచకొండ కమిషనర్ జి.సుధీర్ బాబు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఎం.డి ఎం.రమేష్, ఉమెన్స్ సేఫ్టీ వింగ్ డిసిపి టి.ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.








## మోడీ సంతాపం: అందెశ్రీ మరణం పూడ్చలేని లోటు

తెలంగాణకు రాష్ట్ర గీతం అందించి, తెలుగు సాహిత్యానికి ప్రత్యేక స్పందనను చేకూర్చిన ప్రముఖ కవి అందెశ్రీ మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం సాంస్కృతిక-మేధో ప్రపంచానికి పూడ్చలేని లోటని పేర్కొన్నారు. అందెశ్రీ ఆలోచనలు తెలంగాణ ఆత్మను ప్రతిబింబిస్తాయని, ప్రజల పోరాటాలు, ఆకాంక్షలు, అచంచల స్ఫూర్తికి ఆయన గొంతుకగా నిలిచారని మోదీ తన నివాళిలో అన్నారు. కవిగానే కాదు మేధావిగా కూడా అందెశ్రీ చూపిన దారి అత్యంత ప్రేరణాత్మకమని హైలైట్ చేశారు. అందెశ్రీ పదాలకు హృదయాలను కదిలించే శక్తి, ప్రజల ఆశయాలను ఏకం చేసే శక్తి ఉందని, సామాజిక స్పృహను సాహితీ సౌందర్యంతో మేళవించిన ఆయన శైలి అద్వితీయమని మోదీ పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ "ఓం శాంతి" అని ముగించారు.

## తెలంగాణ సాహితీ శిఖరం నేలకూలింది

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, నవంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):**
ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ ఆకస్మిక మరణం పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర గీతం "జయ జయహే తెలంగాణ" రచించిన అందెశ్రీ మరణం, రాష్ట్ర సాహితీ లోకానికి తీరని లోటు అని పేర్కొన్నారు.
తెలంగాణ ఉద్యమంలో ప్రజల హృదయాలను తాకి, విప్లవ జ్వాలను రగిలించిన జయ జయహే తెలంగాణ గేయం కోట్లాది మంది గొంతుకగా నిలిచిందని సీఎం రేవంత్ గుర్తు చేశారు.స్వరాష్ట్ర సాధనలో ప్రజలకు చైతన్యం నింపడంలో అందెశ్రీ కవిత్వం ప్రత్యేక పాత్ర పోషించిందని కొనియాడారు.
అందెశ్రీతో తనకున్న అనుబంధాన్ని కూడా ముఖ్యమంత్రి స్మరించుకున్నారు . ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర గీతానికి కొత్త స్వర రూపకల్పనలో ఆయనతో పంచుకున్న ఆలోచనలు, సహకారం తనకు ప్రత్యేకమైన అనుభూతి కలిగించిందని తెలిపారు.
"తెలంగాణ సాహితీ శిఖరం కూలిపోయిన భావన కలుగుతోంది. స్వరాష్ట్ర సాధనలో, జాతి చైతన్యంలో అందెశ్రీ చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయి" అని ముఖ్యమంత్రి అభివర్ణించారు. అందెశ్రీ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించిన రేవంత్, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ఏపీ–రాజస్థాన్ రోడ్డు ప్రమాదాలపై సుప్రీం సుమోటో

- **జాతీయ రహదారి ప్రాధికార సంస్థకు నివేదిక ఆదేశం**
- **రోడ్డు భద్రతపై ఆందోళన వ్యక్తం చేసిన ధర్మాసనం**
- **రెండు వారాల్లో స్థితిగతుల నివేదిక ఇవ్వాలని ఆదేశం**
- **అనుమతి లేని ధాబాలు, పార్కింగ్ కేంద్రాలపై సమగ్ర లెక్క తేల్చాలని సూచన**

ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో జరిగిన ఘోర రహదారి ప్రమాదాలను సుప్రీం కోర్టు స్వయంగా కేసుగా స్వీకరించింది. రాజస్థాన్‌లో జరిగిన ప్రమాదంలో 15 మంది, ఆంధ్రప్రదేశ్‌లో బస్సు దగ్ధమై 19 మంది సజీవ దహనమవ్వడం దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనకు దారితీసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రహదారుల భద్రత, ప్రభుత్వ యంత్రాంగం బాధ్యతపై సుప్రీం కోర్టు ఆవేదన వ్యక్తం చేసింది.
న్యాయమూర్తులు జేకే మహేశ్వరి, విజయ్ విష్ణోయ్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. రాజస్థాన్‌లోని జాతీయ రహదారులపై ఉన్న ధాబాలు, అనుమతి లేని నిర్మాణాలు, లారీ నిలిపే కేంద్రాలు, ఇతర వ్యాపార కేంద్రాల వివరాలను రెండు వారాల్లో స్థితిగతుల నివేదిక రూపంలో సమర్పించాలని జాతీయ రహదారి ప్రాధికార సంస్థకు ఆదేశించింది. రహదారి పరిస్థితులు, నిర్వహణలో లోపాలు, భద్రత చర్యల అమలు స్థాయిపై కూడా నివేదిక ఇవ్వాలని స్పష్టం చేసింది. ఈ కేసుకు సీనియర్ న్యాయవాది ఏఎస్ నాదకర్ణిని సలహాదారుగా నియమించిన ధర్మాసనం, రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కూడా కేసులో భాగస్వామిగా చేర్చాలని ఆదేశించింది. రాజస్థాన్ తరపున హాజరైన అధికారి శివ్ మంగళ్ శర్మ, తమ తరపున కోర్టుకు పూర్తిగా సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన దుర్ఘటనను కూడా పరిగణనలోకి తీసుకుని, ఆ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని కూడా కేసులో భాగస్వామిగా చేర్చాలని ఆదేశించారు.
దేశంలో రహదారి ప్రమాదాలు పెరుగుతున్నాయని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన కోర్టు, ప్రమాదాలు కేవలం వాహనదారుల తప్పిదం వల్ల మాత్రమే కాక, అధికారుల నిర్లక్ష్యం, నాణ్యత లేని రహదారి నిర్మాణం కారణంగానూ జరుగుతున్నాయి అని వ్యాఖ్యానించింది. రాత్రివేళ వెలుతురు లేమి, రహదారి పక్కన రక్షణ గోడలు లేకపోవడం, గుంతలు, పక్కన అనుమతి లేని దుకాణాలు.. అన్నీ ప్రమాద తీవ్రతను పెంచుతున్నాయని ఆవేదన వ్యక్తం చేసింది. జాతీయ రహదారుల పక్కన అనుమతి లేకుండా ఉన్న ధాబాలు, టీ దుకాణాలు, వర్క్‌షాపులు ఎన్ని ఉన్నాయో దేశవ్యాప్తంగా లెక్కలు తీసుకోవాలని ఆదేశించింది. రహదారి నిర్మాణం, నిర్వహణలో పనులు చేపడుతున్న కాంట్రాక్టర్‌లు నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అనే అంశంపై కూడా సమగ్ర పరిశీలన చేయాలని జాతీయ ప్రాధికార సంస్థకు సూచించింది. ప్రమాణాలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. రహదారి నిర్మాణం, నిర్వహణ అనేవి కేవలం పనులు కాదు.. కోట్లాది ప్రజల ప్రాణ భద్రతకు నేరుగా సంబంధించిన బాధ్యత అని ధర్మాసనం పేర్కొంది.



## అందెశ్రీ మరణంపై మంత్రి సీతక్క సంతాపం

**హైదరాబాద్, నవంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):**
ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ మృతి పట్ల పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా-శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ (సీతక్క) తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజా సాహిత్యానికి, స్వరాష్ట్ర ఉద్యమానికి అందెశ్రీ అందించిన సేవలు అపూర్వమని ఆమె పేర్కొన్నారు.
అందెశ్రీ రచనలు, గీతాలు తెలంగాణ ఉద్యమ రోజుల్లో ప్రజల్లో చైతన్యం నింపి, స్వరాష్ట్ర సాధనకు దారితీశాయని మంత్రి గుర్తుచేశారు. "జయ జయహే తెలంగాణ" గీతం ఇవాళ రాష్ట్ర గీతంగా ప్రతి తెలంగాణ బిడ్డ గర్వంతో ఆలపిస్తున్నదని చెప్పారు. తెలంగాణ ఉన్నంత వరకూ అందెశ్రీ అందించిన చైతన్యం సజీవంగానే ఉంటుందని పేర్కొన్నారు.
అందెశ్రీ కుటుంబ సభ్యులకు మంత్రి సీతక్క ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.



## అందెశ్రీ పార్థివదేహానికి కేటీఆర్ నివాళి

- **కేటీఆర్ తో పాటు బీఆర్ఎస్ నేతల శ్రద్ధాంజలి**
- **అందెశ్రీ రచనలు తెలంగాణ చరిత్రలో చిరస్థాయి : కేటీఆర్**
- **కుటుంబ సభ్యులకు సానుభూతి**

**హైదరాబాద్, నవంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):**
తెలంగాణ రాష్ట్ర గీత రచయిత, ప్రముఖ కవి అందెశ్రీ పార్థివ దేహానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులర్పించారు. ఆయనతో పాటు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, పలువురు నేతలు హాజరై శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అందెశ్రీ గారి సేవలు, రచనలు, పాటలు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ భావజాలాన్ని, ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లో నింపిన గొప్ప కవి నష్టపోవడం సమాజానికి, సాహిత్యానికి తీరని లోటని పేర్కొన్నారు. అందెశ్రీ గారి రచనలు ప్రజలకు ఎల్లప్పుడూ ప్రేరణగా నిలుస్తాయని, ఆయన మాటల్లో తెలంగాణ ఆత్మ ఉందని కేటీఆర్ భావోద్వేగంగా అన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



## బీహార్‌లో రెండో దశ అసెంబ్లీ పోలింగ్‌కు సర్వం సిద్ధం

**భద్రత కట్టుదిట్టం**

బీహార్‌లో రెండో దశ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మొదటి దశలో 121 స్థానాల్లో ఓటింగ్ జరగగా, మిగిలిన 122 స్థానాలకు మంగళవారం రెండో దశలో పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ దశలో మొత్తం 1302 మంది అభ్యర్థులు ప్రజాభిప్రాయ పరీక్షకు హాజరవుతున్న దాదాపు నాలుగు కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించనున్నారు. రెండో దశలో పశ్చిమ చంపారన్, తూర్పు చంపారన్, సీతామఢి, మధుబని, సుపౌల్, అరేరియా, కిషన్‌గంజ్ వంటి జిల్లాల్లో ఓటింగ్ జరగనుంది. పోలింగ్ నేపథ్యంలో అధికారులు భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. మొత్తం నాలుగు లక్షల మంది పోలీసు సిబ్బంది, కేంద్ర భద్రతాబలగాలను నియమించారు. అవసరమైన సామగ్రితో ఎన్నికల సిబ్బంది ఇప్పటికే సంబంధిత బూత్‌లకు చేరుకున్నారు. ఈ దశలోనూ నితీశ్ కుమార్ ప్రభుత్వంలోని పలువురు మంత్రులు, ప్రముఖ నాయకులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. రాష్ట్రంలో ప్రధాన పోటీ మహాగఠ్‌బంధన్, ఎన్డీయే కూటముల మధ్యనే నెలకొంది. దీనితో పాటు కొత్తగా ప్రశాంత్ కిషోర్ నేతృత్వంలోని జన్ సురాజ్ పార్టీ, లాలూ ప్రసాద్ యాదవ్ పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ నాయకత్వంలోని జనశక్తి జనతాదళ్ పార్టీలు కూడా బరిలో నిలిచాయి. రెండో దశ ఫలితాల ప్రభావం రాష్ట్ర రాజకీయాల దిశను నిర్ణయించే అవకాశముండటంతో అన్ని పార్టీల దృష్టి ఈ దశ పోలింగ్‌పై కేంద్రీకృతమైంది.





## ఉటా ప్రతినిధి బృందంతో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ భేటీ

- **పలుఉన్నత రంగాల్లో భాగస్వామ్య బలోపేతంపై చర్చ**

అమెరికా ఉటా రాష్ట్ర శాసన మండలి అధ్యక్షుడు జే స్టువర్ట్ ఆడమ్స్ నేతృత్వంలోని వ్యాపార ప్రతినిధి బృందంతో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ సమావేశమయ్యారు. రెండు దేశాల మధ్య ఆర్థిక, సాంకేతిక, పరిశోధనా రంగాల్లో సహకారాన్ని మరింతగా పెంపొందించే అంశాలపై ఈ భేటీలో చర్చించారు. కృత్రిమ మేధస్సు, పరిశుభ్ర శక్తి, ఖనిజ వనరులు, విద్య-పరిశోధన, జీవసాంకేతిక రంగం, అంతరిక్ష-విమాన రంగాలు, నూతన తయారీ సాంకేతికత వంటి రంగాల్లో భాగస్వామ్య అవకాశాలు, పెట్టుబడి అవకాశాలు, పరస్పర మార్పిడి కార్యక్రమాలను విస్తరించే దిశగా అభిప్రాయాలు పంచుకున్నారు. నవీన ఆవిష్కరణలు, యువత ప్రతిభ, పరస్పర సహకారంతో రెండు పక్షాలకు ఉపయోగకరమైన అభివృద్ధి అవకాశాలు వున్నాయని ఈ సమావేశం పరిశీలించింది. భారత-ఉటా వ్యాపార, విద్య, పరిశోధన రంగాల అనుబంధం బలోపేతం అయితే పరస్పర అభివృద్ధి, శ్రేయస్సుకు మార్గం సుగమం అవుతుందని మంత్రి పీయూష్ గోయల్ వ్యాఖ్యానించారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఫీజు కారణంగా పరీక్షకు అనుమతి నిరాకరణ

## నిప్పంటించుకుని విద్యార్థి మృతి

- విద్యార్థి ఉజ్వల్ రాణా విషాదాంతం
- కాలేజీ యాజమాన్యం, పోలీసుల వ్యవహారంపై ఆగ్రహం



ఉత్తరప్రదేశ్‌లో చోటుచేసుకున్న ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. కాలేజీ ఫీజు చెల్లించలేదనే కారణంతో పరీక్ష రాసేందుకు అనుమతించకపోవడంతో విద్యార్థి ఆవేదనలో నిప్పంటించుకుని మృతిచెందాడు. ఈ హృదయవిదారక సంఘటన ముజఫర్‌నగర్ జిల్లా బుధానాలో జరిగింది. బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న 22 ఏళ్ల ఉజ్వల్ రాణా శనివారం పరీక్షకు కాలేజీకి వెళ్లాడు. అయితే ఫీజు చెల్లించలేదనే కారణంతో అతడిని పరీక్ష హాల్‌లోకి అనుమతించలేదు. పరీక్షకు అనుమతి నిరాకరించడంపై ఉజ్వల్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాడు. దీనిని కారణంగా చూపుతూ కాలేజీ యాజమాన్యం పోలీసులను పిలిపించింది. అక్కడికి చేరుకున్న పోలీసులు విద్యార్థిని నొప్పించి వ్యవహరించినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ అవమానం తట్టుకోలేక ఉజ్వల్ కాలేజీ బయటనే నిప్పంటించుకున్నాడు. తీవ్రంగా కాలిన అతడిని స్థానిక ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మరణించాడు. ఈ ఘటనతో బుధానాలో ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ఉజ్వల్ కుటుంబ సభ్యులు కాలేజీ మేనేజర్ అరవింద్ గార్గ్, ప్రిన్సిపాల్ ప్రదీప్ కుమార్, ఉపాధ్యాయుడు సంజీవ్ కుమార్, అక్కడ విధులు నిర్వహించిన ముగ్గురు పోలీసులపై ఫిర్యాదు చేశారు. ఫీజు పేరుతో వేధింపులు, పోలీసుల ప్రవర్తనే ఉజ్వల్ మృతికి కారణమని కుటుంబ సభ్యులు ఆరోపించారు. దీని ఆధారంగా పలు కేసులు నమోదు అయ్యాయి. విధుల్లో నిర్లక్ష్యం కారణంగా సంబంధిత పోలీసు సిబ్బందిపై కూడా చర్యలు ప్రారంభమయ్యాయి. ఎస్ఐ నంద్ కిషోర్, కానిస్టేబుళ్లు వినీత్, జ్ఞాన్‌వీర్‌లను పోలీస్ లైన్‌కు పంపినట్లు ఎస్‌ఎస్పీ సంజయ్ కుమార్ తెలిపారు. నిందితులపై మరిన్ని చర్యల కోసం ప్రత్యేక బృందం ఏర్పాటుచేసినట్లు వెల్లడించారు.
ఈ ఘటనపై ప్రతిపక్ష పక్షాలు ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించాయి. ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజులపై నియంత్రణ లేకపోవడమే ఈ పరిస్థితులకు దారితీస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశాయి. బాధిత కుటుంబానికి ఒక కోటి రూపాయల పరిహారం, కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశాయి.






# 'సహకార కుంభ్ 2025'లో అమిత్ షా


- సహకార రంగ అభివృద్ధికి కొత్త దిశ
- సహకార బ్యాంకుల డిజిటలీకరణ, విస్తరణకు రోడ్‌మ్యాప్ సిద్ధం కానున్నదని సూచన

సహకార సిద్ధాంతం ద్వారా దేశ అభివృద్ధి లక్ష్యంగా మోదీ ప్రభుత్వం పనిచేస్తోందని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. న్యూఢిల్లీలో జరిగిన పట్టణ సహకార రుణ రంగ అంతర్జాతీయ సమావేశం 'సహకార కుంభ్ 2025' లో ఆయన పాల్గొని ప్రసంగించారు. సహకార రంగానికి కొత్త విధానాలు, సాంకేతికత, నవ నిర్మాణాలతో బలాన్నిచ్చే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ సమావేశంలో జరిగిన చర్చలు పట్టణ సహకార బ్యాంకుల డిజిటల్ రూపాంతరం, సేవల విస్తరణకు స్పష్టమైన మార్గపటం అందిస్తాయని అమిత్ షా అభిప్రాయపడ్డారు. ప్రతి నగరంలో సహకార బ్యాంకులను ఏర్పాటు చేసే లక్ష్యాన్ని కూడా ఈ వేదికపై ప్రతిపాదించారు. దీనితో సహకార రంగంలో స్వయం సమృద్ధి, సమగ్ర అభివృద్ధికి మరింత వేగం అందుతుందని తెలిపారు. 'సహకార కుంభ్ 2025'లో 'సహకార డిజీ-పే' మరియు 'సహకార డిజీ-లోన్' అనువర్తనాలను ఆవిష్కరించారు. ఈ కొత్త సేవలు సహకార బ్యాంకింగ్ వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేస్తాయని, పారదర్శకత పెంచి సేవలను సులభతరం చేస్తాయని అమిత్ షా అన్నారు. సహకార రంగం ద్వారా గ్రామీణం నుంచి పట్టణం వరకు అన్ని వర్గాల ప్రజలకు ఆర్థిక శక్తి కల్పించడం తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు.

# అంతర్జాతీయ ఉగ్ర నెట్‌వర్క్ ఛేదన

- ఇద్దరు వైద్యులతో సహా ఏడుగురు అరెస్టు
- విద్యావంతుల ముసుగులో ఉగ్ర నెట్‌వర్క్
- భారీగా ఆయుధాలు, మందుగుండు, పేలుడు పదార్థాలు స్వాధీనం
- దేశాల మధ్య విస్తరించిన ఉగ్ర మద్దతు బృందం బట్టబయలు





**అరెస్టయిన వారి పేర్లు:**
ఆరిఫ్ నిసార్ దార్ సాహిల్ (నౌగామ్)
యాసిర్ ఉల్ అష్రఫ్ (నౌగామ్)
మక్సూద్ అహ్మద్ దార్ షాహిద్ (నౌగామ్)
మౌల్వీ ఇర్ఫాన్ అహ్మద్ (షోపియాన్)
జమీర్ అహ్మద్ అహంగర్ ముల్లాషా (గందర్బాల్)
డాక్టర్ ముజమ్మిల్ అహ్మద్ గనై ముసైబ్ (పాంపోర్)
డాక్టర్ ఆదిల్ (కుల్గామ్)

జమ్మూ-కాశ్మీర్ పోలీసులు అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ స్థాయిలో పనిచేస్తున్న ఉగ్రవాద నెట్‌వర్క్‌ను ఛేదించారు. నిషేధిత ఉగ్ర సంస్థలైన జైష్ ఏ మహ్మద్, అన్సార్ ఘజ్వత్ ఉల్ హింద్ ప్రభావంలో పనిచేస్తున్న ఏడుగురిని అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరు వైద్యులు కూడా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. అరెస్టులతో పాటు భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రి, పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, అక్టోబర్ 19న శ్రీనగర్‌లో బున్‌పోరా-నౌగామ్ ప్రాంతంలో జైష్ ఏ మహ్మద్ పేరుతో హెచ్చరిక పోస్టర్లు వెలిశాయి. వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించగా, ఈ నెట్‌వర్క్‌లో విద్యావంతులు, వైద్యులు, మత బోధకులు, వృత్తి జీవులు కూడా ఉన్నట్లు తేలింది. సామాజిక సేవ సంస్థల పేరిట నిధులు సేకరించడం, విదేశీ సంబంధాల ద్వారా ఉగ్ర కార్యకలాపాలను ముందుకు నెట్టడం వీరి వ్యూహమని పోలీసులు వెల్లడించారు.
దర్యాప్తు సమయంలో జమ్మూ-కాశ్మీర్‌లోని శ్రీనగర్, అనంత్‌నాగ్, గందర్బాల్, షోపియాన్‌తో పాటు హరియాణాలోని ఫరీదాబాద్, ఉత్తరప్రదేశ్‌లోని సహరాన్‌పూర్ ప్రాంతాల్లో ఒకేసారి సోదాలు జరిగాయి. ఫరీదాబాద్‌లో అల్ ఫలాహ్ విశ్వవిద్యాలయం వద్ద డాక్టర్ ముజమ్మిల్‌ను పట్టుకున్నారు. అతని నివాసంలో పేలుడు పదార్థాలు లభించగా, అక్కడే దాదాపు 360 కిలోల అమోనియం నైట్రేట్, రైఫిల్స్ స్వాధీనం అయ్యాయి. మరో వైద్యుడు ఇచ్చిన సమాచారంతో మరిన్ని ఆయుధాలను పోలీసులు గుర్తించారు. పోలీసుల ప్రకారం, ఈ నెట్‌వర్క్ ప్రధాన లక్ష్యం యువతను మత ప్రేరేపణతో ఆకర్షించడం, వారికి శిక్షణ కల్పించడం, పేలుడు పదార్థాలు సేకరించి దాడులకు సిద్ధం చేయడం. విద్య, సేవ పేరుతో ఉగ్రానికి ముసుగు వేసిన ఈ నెట్‌వర్క్ బట్టబయలు కావడం దేశ భద్రత కోణంలో కీలక అభివృద్ధిగా మారింది.

# భారత జెన్-జడ్ యువతపై రాహుల్ గాంధీ ప్రశంస

- సత్యం, అహింస విలువలతో దేశానికి నూతన దిశ చూపగల తరం అని అభినందన



భారత్ యువతలో కొత్త తరం చూపిస్తున్న ఉత్సాహం దేశ భవిష్యత్తుపై నమ్మకాన్ని పెంచుతోందని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అభిప్రాయపడ్డారు. ప్రత్యేకించి ప్రస్తుత జెన్-జడ్ తరం సత్యం, అహింస, దయ, ధైర్యం వంటి విలువలను అనుసరిస్తూ దేశాన్ని న్యాయబద్ధమైన, భవిష్యత్తు వైపు నడిపించే శక్తి కలిగినదని ప్రశంసించారు. రాజకీయ రంగంలోకి ఈ తరం ముందుకు రావడంపై ఆనందం వ్యక్తం చేసిన రాహుల్ గాంధీ, విలువల ఆధారంగా ప్రజాస్వామ్యాన్ని బలపరచే కొత్త రాజకీయ సంస్కృతికి ఈ తరం మార్గదర్శకంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. యువతలో పటిష్టమైన ఆలోచనశక్తి, సామాజిక బాధ్యత, హృదయపూర్వకత పెరిగిపోతోందని పేర్కొన్నారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో కొత్త ఊపును తీసుకురావడంలో ఈ తరం కీలకభూమిక పోషిస్తుందని, సమానత్వం, న్యాయం, సత్సిద్ధాంతాల పట్ల వీరిలో ఉన్న నిబద్ధత భవిష్యత్ భారత్‌ను మరింత బలం చేకూరుస్తుందని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.


# విమానాలను నడుపనున్న ఆకాశ ఎయిర్‌లైన్స్..!

ఆకాశ ఎయిర్ త్వరలో మరికొన్ని దేశీయ, అంతర్జాతీయ రూట్‌లో విమానాలను ప్రారంభించనున్నది. ఈ మేరకు బోయింగ్ నుంచి విమానాలను త్వరగా తీసుకురావాలని ఆశియస్తున్నట్లుగా సీనియర్ ఎయిర్‌లైన్ అధికారి సోమవారం తెలిపారు. ఆకాసా ఎయిర్‌లైన్స్ 2022 ఆగస్టులో తొలిసారిగా కార్యకలాపాలు ప్రారంభించింది. ప్రస్తుతం ఆ కంపెనీకి 30 విమానాలు ఉన్నాయి. 24 దేశీయ, మరో ఆరు అంతర్జాతీయ గమ్యస్థానాలకు విమానాలను నడుపుతుంది. త్వరలోనే ఢిల్లీ నుంచి మరికొన్ని అంతర్జాతీయ విమానాలను ప్రారంభించనున్నట్లు ఆకాశ ఎయిర్ సహ వ్యవస్థాపకుడు, చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ ప్రవీణ్ అయ్యర్ పేర్కొన్నారు. ఎయిర్‌లైన్ ప్రస్తుతం ఢిల్లీ నుంచి ప్రతిరోజూ 24 విమానాలను నడుపుతోంది. సింగపూర్, ఉజ్బెకిస్తాన్, ఇండోనేషియా, వియత్నాం, తాష్కెంట్‌తో సహా వివిధ విదేశీ గమ్యస్థానాలకు విమానాలను నడపాలని ఎయిర్‌లైన్ యోచిస్తుందని అయ్యర్ ఓ బ్రీఫింగ్‌లో చెప్పారు. ఆకాశ ఎయిర్ ప్రస్తుతం ఆరు అంతర్జాతీయ నగరాలకు విమానాలను నడుపుతోంది. ఇందులో దోహా (ఖతార్), జెడ్డా, రియాద్ (సౌదీ అరేబియా), అబుదాబి (యూఏఈ), కువైట్ సిటీ, ఫుకెట్ (థాయిలాండ్) ఉన్నాయి. ఎయిర్‌లైన్ మొత్తం 226 బోయింగ్ 737 మాక్స్ విమానాలను ఆర్డర్ చేసింది. అయితే, డెలివరీలో జాప్యం జరుగుతున్నది. బోయింగ్ ఉత్పత్తిని పెంచుతున్నందున కంపెనీకి వేగంగా విమానాలు వస్తాయని ఆశిస్తున్నట్లుగా అయ్యర్ తెలిపారు. అనుబంధ ఆదాయ వృద్ధిపై సంతోషంగా ఉన్నామని.. లోడ్ ఫ్యాక్టర్, విమాన ఛార్జీల పరంగా ప్రస్తుతం సమతుల్యత ఉందని ఆయన వివరించారు.




# అందెశ్రీకి వీడ్కోలు..

**అందెశ్రీ వెళ్లిపోయారు...**
**తెలంగాణ మనసుకు మాటలు రావట్లేదు**



హైదరాబాద్, నవంబర్ 10

తెలంగాణ ఆవిర్భావంలో గీతంలా నడచిన గొప్ప కవి అందెశ్రీ ఇక లేరన్న వార్త ఈ నేల మనసును ఛిద్రమైంది. అకస్మాత్తుగా కుప్పకూలిన ఆయన, వైద్యుల చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారన్న సమాచారం ప్రజల్లో విషాదాన్ని పెంచింది. తెలంగాణ ప్రజలు ఈ వార్త వినగానే నిశ్శబ్దంలో మునిగిపోయారు. మాటలు రావడంలేదు... ఊపిరి బిగుసుకుపోతుంది.
ఒక కుటుంబ పెద్దను కోల్పోయినట్టు, ఒక పేరున్న కవిని కోల్పోయినట్టు, ఒక ఉద్యమాశయాన్ని మోసిన మనిషిని కోల్పోయినట్టు తెలంగాణ ప్రతి ఇంట్లోనూ ఈ రోజున బాధ అలుముకుంది. ఊరూరా, తల్లి తన బిడ్డను కోల్పోయిన వేదన గాలిలో వినిపిస్తుంది. ఆయన పేరును పలికితేనే ప్రజల గొంతు కంపిస్తోంది. ఎందుకంటే అందెశ్రీ కేవలం కవి కాదు——మన హృదయాలకు దగ్గరైన వ్యక్తి.
పోరాటకాలంలో తెలంగాణ ప్రజలు గాయపడినప్పుడు, బాధతో అరిచినప్పుడు, ఆ కేకలకు అక్షరాలుగా సహాయం చేసిన వ్యక్తి అందెశ్రీ. మన ఆవేదనను మనకన్నా బాగా పలకరించిన మాటలతో ప్రపంచానికి వినిపించిన అరుదైన అక్షరకారుడు. ప్రజల కన్నీటిని పద్యంగా మలిచి, ప్రజల ఆశల్ని గీతంగా మార్చి, తెలంగాణ ఆత్మను పదాలలో నిలిపిన మహానుభావుడు. ఆయన కలం మనకు అండగా నిలిచిన రోజులు మరువలేనివి.
ఎవ్వరూ మాట్లాడలేని రోజుల్లో, తెలంగాణ మాట తడబడిన రోజుల్లో, మన కోసం గళం విప్పిన తొలి స్వరం అందెశ్రీది. ఆయన రాసిన ప్రతి పదం, ప్రతి వాక్యం, ఉద్యమంలో అగ్నిని రగిలించింది. నాయకుల ప్రసంగాలకన్నా ఆయన గీతం ప్రజల రక్తంలో ఎగసి పడ్డది. కవిత్వం కూడా యుద్ధాస్త్రం అవుతుందని, ఒక మాట కూడా వేలమందిని లేపగలదని ఆయన నిరూపించారు.
అభిమానం లేదనుకోవడం కాదు, ఆయనకు ప్రజల ప్రేమ సముద్రంలా లభించింది. కానీ ఆ ప్రేమను ఎప్పుడూ తనకే అన్నట్టు ఎగరలేదు. గెలుపులు ఆయనను మార్చలేదు, ప్రశంసలు అతిశయాన్ని పెంచలేదు, పురస్కారాలు అతని హృదయాన్ని గట్టిగా చేయలేదు. అదే అందెశ్రీని గొప్ప మనిషిగా నిలబెట్టింది. తెలంగాణ కోసం రాసిన పాదాల్లో ఆయన గుండె చప్పుళ్లు వినిపించేవి.
సోమవారం అందెశ్రీ మృతదేహం చూస్తూ, వేలాది మంది నిలబడతారు. కానీ ఆయనతో మాట్లాడాలని, ఒక్కసారి నవ్వుతూ చేతులు చాపాలని కోరుకున్న ఆ క్షణం ఇక రాదు అనే నిజం గుండెను ముక్కలు చేస్తోంది. ఆయన చదివిన కవితలు, ఆయన పలికిన మాటలు, ఆయన నవ్వుతూ చెప్పిన తెలంగాణ ప్రేమ——ఇప్పుడు జ్ఞాపకాల్లో మాత్రమే మిగిలిపోతున్నాయన్న ఆలోచనే భరించలేనిది.
తెలంగాణలో ఎన్నో మరణాలు జరిగాయి... ఎన్నో ప్రముఖులు వెళ్లిపోయారు... కానీ అందెశ్రీ మరణం ఒక వ్యక్తి మరణం కాదు——ఒక భావజాలానికి, ఒక యుగానికి, ఒక తెలంగాణ ఆత్మ స్వరానికి పగిలిన దెబ్బ. ఆయన లేరు అనేది తెలంగాణకి భరించలేనంత పెద్ద వేదన. ప్రజలు మాటలు రాయలేక, ఆ వేదనను గొంతులోనే బంధించుకుని, నిశ్శబ్దంగా కన్నీళ్లు కారుస్తున్నారు.
రోజు రోజుకీ మనం కోల్పోతున్న నిజమైన మానవ విలువల్లో, అందెశ్రీ మనకు మనసును మళ్లీ మనుషులవైపు తిప్పిన మనిషి. ఆయన రాసిన పదాలు మన్ని మనం గుర్తు చేసుకున్నాయి. తెలంగాణ అనే పేరుకు ఆత్మ ఉందని ఆయన కవిత్వమే మనకు అర్థం చేసింది. మన మట్టిపట్ల ఉన్న గౌరవాన్ని ఆయన మాటలు మళ్లీ మళ్లీ మేల్కొల్పాయి.
సోమవారం ఆయనను చివరిసారి చూసేందుకు వేలమంది చేరతారు. కానీ మనసు అడిగే ఒక్క ప్రశ్న——ఎందుకు ఇంత త్వరగా? ఇంకా ఎంత రాయాల్సి ఉంది... ఇంకా ఎంత ప్రేమ పంచాల్సి ఉంది... ఇంకా ఎంత తెలంగాణ మనసు తడిపేయాల్సి ఉంది... ఈ ప్రశ్నలకు సమాధానాలు లేవు. ఏం చెప్పినా బాధ తగ్గదు. తెలంగాణ ప్రజల హృదయం ఖాళీ అయిపోయినట్టుంది.
గతం చెప్తుంది శరీరం వెళ్లిపోతుంది, వ్యక్తి మరిచిపోతారు. కానీ అందెశ్రీ వంటి వారు మాత్రం చరిత్రలో కాదు. ప్రజల హృదయంలో జీవిస్తారు. ఆయన తిరిగి రారు... కానీ ఆయన రాసిన పదాలు, ఆయన పాడిన తెలంగాణ ప్రేమ, ఆయన కలలో ఊహించిన తెలంగాణ ఇవి ఎప్పటికీ మరణించవు. అందెశ్రీ, మీరు వెళ్లిపోయినా... మీ ప్రేమ మనలో మిగిలిపోయింది. తెలంగాణ మిమ్మల్ని మర్చిపోలేదు... మర్చిపోదు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in